ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	37.5	28
కావలి	37	28
ఆత్మకూరు	47	28
ఉదయగిరి	40	26
కందుకూరు	37	28



మైనార్టీ కార్పొరేషన్లకు
పూర్వ వైభవం

- ఉపాధి కల్పనకు రుణాల మంజూరు
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసి, ఆయా వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. ఆయా కార్పొరేషన్లలో ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక రుణ పథకాలను ప్రవేశపెట్టింది. స్వయం ఉపాధిని ప్రోత్సహిం చడమే లక్ష్యంగా రుణాలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 2,64,886 మంది ముస్లింలు, 21,373 మంది క్రిష్టియన్లు, 588 మంది సిక్కులు, 168 మంది బౌద్ధులు, 2,294 మంది జైనులు ఉన్నారు. అయితే 2011 తర్వాత వారి సంఖ్య మూడింతలుగా పెరిగినట్లు సమాచారం. వీరంతా ప్రభుత్వం అందించే ఉపాధి పథకాల కోసం ఎదురుచూస్తున్నారు.

రుణాల వివరాలు..



జిల్లా మైనారిటీస్ కార్పొరేషన్ కార్యాలయం

ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలకు ఇస్తున్న రుణాలు రూ.లక్ష నుంచి 8లక్షల వరకు ఉన్నాయి. రూ.1 లక్ష రుణంతో కిరాణా దుకాణాలు, చెప్పుల దుకాణాలు, బట్టల దుకాణాలు తదితరాలు ఏర్పాటు చేసుకునే వీలుంది. రూ.లక్ష నుంచి 5లక్షలలోపు రుణాలతో ఆటోలు, కార్లు ఇతర వాహనాలు కొనుగోలు చేసుకుని ఉపాధి పొందొచ్చు. రూ.5 లక్షల నుంచి 8లక్షలలోపు రుణాలతో మెడికల్ షాపులు, జిమ్ వంటి ఫిట్నెస్ సెంటర్లు తదితరాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందే అవకాశం ఉంది. స్లాబుల వారీగా ఈ రుణాలను మంజూరు చేస్తారు. రూ.లక్ష రుణాన్ని స్లాబ్ వన్ కింద అందజేస్తారు. ఇందులో యూనిట్ ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ ఉంటుంది. 2వ స్లాబ్‌లో రూ.లక్ష నుంచి రూ.3లక్షలలోపు రుణాలు ఇస్తారు. ఇందులో యూనిట్ కాస్ట్ మీద రూ.1.25 లక్షల సబ్సిడీ ఉంటుంది. రూ.3 లక్షల నుంచి 5లోల రుణాలకు యూనిట్ కాస్ట్ మీద రూ.2లక్షల సబ్సిడీ ఇస్తారు. రూ.5లక్షల నుంచి 8లక్షలలోపు రుణాలకు 50శాతం సబ్సిడీ ఉంటుంది. బీఫార్మశీ, డీఫార్మశీ చేసిన మైనార్టీ యువత ఈ రుణాలు వినియోగించుకోవచ్చు. పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు దరఖాస్తు చేసుకోనే అవకాశం ఉంది. సబ్సిడీ రుణాల కోసం ఏపీ ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. మైనార్టీలు అంటే ముస్లిం, క్రిష్టియన్లు, బౌద్ధులు, సిక్కులు, జైన్‌లు, పార్సీలు అని పేర్కొంది.

రుణాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ యువత సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు రిజిస్టర్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది ఏపీ ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. 21 నుంచి 50 సంవత్స రాల మధ్య వయసున్న అర్హులు దరఖాస్తు చేసుకోవాలి. స్లాబ్‌ల వారీగా ఎన్ని యూనిట్లు కేటాయిస్తారనేది త్వరలో తెలియజేస్తాం.

- షేక్.హైఫా, జిల్లా మైనార్టీస్, కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



పోలీసులు అరెస్ట్ చేసిన సైబర్ నేరగాళ్లు వీరే!

మాటలే పెట్టుబడి..
చేసేదంతా బురిడీ!

- సైబర్ నేరగాళ్ల గుట్టు రట్టు
- చిన్నబజారు స్టేషన్‌లో మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి..
- ప్రత్యేక బృందాలతో కేసు దర్యాప్తు
- నకిలీ గుర్తింపుతో 236 బ్యాంకు ఖాతాలు
- 36 ఖాతాలపై 436 ఫిర్యాదులు
- ఏడుగురు నిందితుల అరెస్ట్.. నగదు, ఫోన్లు ఇతర సామగ్రి స్వాధీనం
- ప్రధాన సూత్రధారి రాజస్థాన్ వాసి

'మీ స్తోమతను బట్టి నగదును పెట్టుబడిగా పెట్టండి. ఎక్కువ ఆదాయం పొందండి.' అంటూ ఫోన్‌లో అమాయకులను మాయ మాటలతో నమ్మిస్తారు. వీరిని నమ్మి నగదు జమ చేశాక.. ఇదిగో మీ పెట్టుబడికి ఇదీ లాభం అంటూ కొంత నగదును జమ చేసి మరీ ఖాతాలో చూపిస్తారు. ఇలా పలు మార్లు లావాదేవీలు నడిపాక పెద్దమొత్తంలో పెట్టుబడి పెడితే రూ.కోట్లు సంపాదించ వచ్చని నమ్మబలుకుతారు. నిజమే కదా అని.. రూ.లక్షలు జమచేశాక.. రూ.కోట్ల లాభం వచ్చినట్టు ఖాతాలో చూపిస్తారు. తీరా నగదు డ్రా చేసుకునేందుకు వెళితే రాదు. ఇలా ప్రజలను నమ్మించి రూ.కోట్లు దోచేస్తున్న ఓ అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు పూర్వాప రాలను, నిందితుల వివరాలను శనివారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కృష్ణకాంత్ విలేకరులకు వెల్లడించారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

నెల్లూరులోని పొగతోటకు చెందిన లలితకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సంబంధించిన ఓ లింక్ రావడంతో ఆమె క్లిక్ చేసింది. వెంటనే లలిత వాట్సప్ నెంబర్‌కు నిషాబసు అనే మహిళ మెసేజ్ చేసి ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సంబంధించిన సూచనలు, సలహాలు ఇచ్చి లాభాలు వచ్చేలా చేస్తామని నమ్మించి ఓ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించింది. షేర్ కొనుగోలుకు కొంత నగదు వేయించుకొని ఆదాయం వచ్చిందని పలుమార్లు చెబుతూ నమ్మించింది. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం వస్తుందని చెప్పడంతో లలిత అప్పుచేసి మరీ జనవరి 23 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు పలు దఫాలుగా రూ.2,46,30,396 డిపాజిట్ చేశారు. ఖాతాలో రూ.4,02,24,759 నగదు ఉన్నట్లు సైబర్ నేరగాళ్ల లలితకు చూపించారు. ఆ నగదు డ్రా చేసుకొనేందుకు ప్రయత్నించగా రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన లలిత గత నెల 9వ తేదీన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అంతా నకిలీలతోనే..

రాజస్థాన్‌కు చెందిన ప్రధాన నిందితుడు రామారామ్ కొంతమంది యువకులకు వేతనంతోపాటు భారీగా కమీషన్లు ఇచ్చి నియమించుకున్నారు. వీరు నకిలీ ఆధార్, పాన్ కార్డులను సృష్టించి వాటి ద్వారా బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేస్తారు. బయోమెట్రిక్ ధ్రువీకరణ అవసరం లేని రోడ్‌సైడ్ సేల్ పాయింట్ల నుంచి డీ-కేవైసీ ద్వారా సిమ్ కార్డులను పొందుతారు. బ్యాంకు అధికారులను సంప్రదించి ఈ నకలీ పత్రాలను ఉపయోగించి కరెంట్ ఖాతాలను ప్రారంభిస్తారు. బ్యాంక్ ఖాతా పాస్‌బుక్‌లను కొరియర్ ద్వారా రాజస్థాన్‌లోని రామారామ్‌కు పంపుతారు. ఎస్ఎంఎస్ ఏపీకే ఫైళ్లను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా బ్యాంకు లింక్ చేయబడిన ఫోన్ నెంబర్లను వేర్వేరు మొబైళ్లలో ఉంచి సులభంగా యాక్సెస్ చేయడానికి అన్నిటినీ ల్యాప్‌టాప్‌కు కనెక్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి రామారామ్ నిందితులకు నెలకు రూ.15 వేల నుంచి 20 వేలు జీతం, కరెంట్ ఖాతా తెరవడానికి రూ.లక్ష కమీషన్, పొదుపు ఖాతా తెరవడానికి రూ.20 వేలు కమీషన్ ఇస్తాడు. ఇలా నాలుగు నెలల క్రితం చెన్నైలో శివంమెటల్ కార్పొరేషన్, సూర్యా ఇన్‌ఫెక్స్ తదితర పేర్లతో సైబర్ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. షేర్ మార్కెట్‌లో నగదు పెడితే అధిక ఆదాయం వస్తుందని అమాయక ప్రజలకు ఫోన్లు చేసి నమ్మించి కరెంట్ అకౌంట్లలో నగదు వేయించుకొని మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసుల విచారణలో ఇప్పటివరకు 236 బ్యాంక్ ఖాతాలలో 36 ఖాతాల మీద 436 ఫిర్యాదులు ఎన్సీఆర్పీ పోర్టల్‌లో నమోదైనట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. ప్రపంచంలో ఎవరికీ ఏమీ ఊరికే రావని, ఎవరూ ఊరికే ఇవ్వరన్న విషయాన్ని ప్రజలు గ్రహించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, సైబర్ క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు అయ్యప్ప, శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఐ జి శ్రీహరి, హెడ్‌కానిస్టేబుళ్లు, తదితరులను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ పి సింధుప్రియ తదితరులు పాల్గొన్నారు.



మూడు రాష్ట్రాల్లో శోధన

ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. రోజుల తరబడి ప్రత్యేక బృందాలు తమిళనాడులోని చెన్నై, తెలంగాణలోని హైదరాబాదు, రాజస్థాన్ ప్రాంతాల్లో దర్యాప్తు చేపట్టాయి. బాధిత మహిళ డిపాజిట్ చేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా నిందితులు రాజస్థాన్‌కు చెందిన రామారామ్, ఈయన అనుచరులైన గోగారామ్, హేమంత్‌కుమార్, కైలాష్, నాగారాం, తెలంగాణా రాష్ట్రానికి చెందిన వీరేశ్వరరావు, ఎం రవిలుగా గుర్తించి, ఈ నెల 25వ తేదీన ఐదుగురిని, శనివారం ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2 లక్షల నగదు, 50 మొబైళ్లు, ఏటీఎం కార్డులు, ప్రింటర్ ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లోని రూ.39 లక్షలు నగదు ఫ్రీజ్ చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.

గిరిజనుల డబ్బులకు
లెక్కేది!?

- రాపూరులో భారీగా సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి
- డీఆర్‌డీఏ ఉద్యోగులే తినేసినట్లు నిర్ధారణ
- నెల రోజుల క్రితం నోటీసులతో సరి
- థర్డ్ పార్టీ విచారణతోనే మరిన్ని వాస్తవాలు

8లో..

గిరిజనుల నిధులు దుర్వినియోగం చేశారని తేలింది.. కానీ నెల రోజులు గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇంటి దొంగలే ఈ అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారణ అయినా నోటీసులతో సరిపెట్టారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం అటుంచితే కనీసం పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేద్దామన్న ఆలోచన కూడా కనిపించడం లేదు. నోరు లేని గిరిజనులే కదా అన్న ధైర్యమా!? లేదా తమను అడిగే ధైర్యం ఎవరికి ఉందన్న ధీమానో తెలియదు కానీ డీఆర్‌డీఏ అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రాపూరు మండలంలోని యానాదుల సమాఖ్యల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చినా ఇంత వరకూ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయోచ్!



నెల్లూరు (విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలు నెల్లూరులోని గోదా ముకు చేరుతున్నా యని డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 1 నుంచి 10వతరగతి వరకు 10,23,718 పాఠ్యపుస్తకాలు వస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా మండల కేంద్రాలకు తరలిస్తున్నామని, పాఠశాలలు తెరిచే నాటికి పాఠ్యపుస్తకాలన్నీ ఇవ్వనున్నట్లు తెలిపారు.



మత్స్యకారులకు చెక్కు అందిస్తున్న మత్స్య శాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు

12,239 మంది మత్స్యకారులకు
రూ.24.47 కోట్ల జమ

నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా జిల్లాలోని 12,239 మంది మత్స్యకారులకు రూ.24,47,80,000 నగదు జమ చేసినట్లు మత్స్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాళెం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు మత్స్యకార సేవలో పథకాన్ని ప్రారంభించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి జిల్లా అధికారులు, నేతలు, మత్స్యకారులు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ సముద్రంలో వేట నిషేధం సందర్భంగా మత్స్యకారుల జీవన భృతికి రూ.20వేలు చొప్పున ప్రభుత్వం అందించిందని చెప్పారు. కావలిలో 4778 మందికి, కోవూరులో 3102, సర్వేపల్లిలో 1887, కందుకూరులో 2472 మందికి ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు చాన్ బాషా, శ్రీనివాసులు, మత్స్యకార సంఘ నేతలు కొండూరు పాలిశెట్టి, పామంజి శేషయ్య, కొమారి విజయమ్మ, రామాని నారాయణ, భక్తాని శ్రీను, ఆవల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు పెంచి..
నిధులు దోచేసి!

- పీఆర్‌లో ఎస్ఎస్ఆర్ రేట్ల మాయాజాలం
- క్వారీ చూపించేది చీమకుర్తి.. తోలేది అన్నవరం
- భారీగా కాంట్రాక్టర్లకు ప్రయోజనం
- అధికారుల చేతివాటంతో ప్రభుత్వ ఖజానాకు గండి
- గ్రామీణ లింకురోడ్ల నిర్మాణంలోను నిబంధనలకు పాతర
- లింకురోడ్ల నిర్మాణంలో నిబంధనలకు తూట్లు



మహదేవపురం రోడ్డులో పొలాల్లోకి నాసిరకంగా అప్రోచ్‌లు వేసిన దృశ్యం



తిమ్మారెడ్డిపాలెం - అయ్యవారిపల్లి రోడ్డుకు అన్నవరం క్వారీనుంచి తోలిన మెటల్, వెట్‌మిక్స్ (ఫైల్)

కందుకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖలో ఎస్ఎస్ఆర్ రేట్ల మాయాజాలం నడుస్తోంది. ప్రభుత్వం ఏదైనా అధికారులు మాత్రం చేతివాటంతో కాంట్రాక్టర్లకు భారీగా లబ్ధి చేకూరుస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. మెటీరియల్ వాస్తవ ధరకు నాలుగు రెట్లు అదనంగా చెల్లించడం ద్వారా కోట్లాది రూపాయల దుర్వినియోగానికి అధికారులు పాల్పడుతున్నారు. కందుకూరు ప్రాంతంలో ఎక్కడ రహదారి పనులు జరిగినా చీమకుర్తి నుంచే మెటల్ తోలాలని నిబంధనతో అక్కడి నుంచి తోలేందుకు అయ్యే ఖర్చును లెక్కించి యూనిట్‌కు రూ.12వేలకు పైగా అధికారులు చెల్లిస్తున్నారు. అయితే నిజంగా చీమకుర్తి నుంచే తోలినా యూనిట్ విలువ రూ.4వేలకు మించదు. పోనీ అభివృద్ధి పనులకు వాడే మెటల్, వెట్‌మిక్స్‌లను చీమకుర్తి నుంచి తోలుతున్నారా అంటే అదీనూలేదు. రాళ్లపాడు రిజర్వాయరుకు సమీపంలో ఉన్న కొండాపురం మండలం అన్నవరం క్వారీ నుంచే అధిక శాతం మెటీరియల్ తోలుతున్నారు. అతి కొద్దిశాతం కాంట్రాక్టర్లు మాత్రమే చీమకుర్తి నుంచి తోలుతుండటం విశేషం. చీమకుర్తి నుంచి తోలినా వాస్తవ ధరకన్నా మూడురెట్లు అదనంగా చెల్లిస్తున్నారు. ఇక అన్నవరం నుంచి తోలేవారికైతే యూనిట్ రూ.2500లోపే సైట్‌లోకి చేరుస్తుండటంతో వాస్తవధరకన్నా రమారమి 4రెట్లు అదనంగా చెల్లిస్తున్న పరిస్థితి. ఇదే రీతిలో వెట్‌మిక్స్‌లోను భారీగా నిధుల దోపిడీ జరుగుతోంది. ఇటీవల నిర్మించిన తిమ్మారెడ్డిపాలెం - అయ్యవారిపల్లి రోడ్డుకు దాదాపు 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న చీమకుర్తి క్వారీని అధికారులు చూపించగా కాంట్రాక్టరు మాత్రం పనిప్రదేశం నుంచి కేవలం 20 కిలోమీటర్లలో ఉన్న అన్నవరం నుంచి మెటల్, వెట్‌మిక్స్ తోలి పనికానిచ్చేశారు. అన్నవరం క్వారీ మెటీరియల్ చీమకుర్తితో పోలిస్తే నాణ్యతగా ఉండదని కూడా చెబుతారు. అయినా అధికారులు ఇవన్నీ మామూలే అన్నట్లు పనులు కానిచ్చేయడంతో రూ.7 కోట్ల విలువైన ఆ ఒక్క పనిలోనే కాంట్రాక్టరుకు 2 కోట్లకుపైగా లబ్ధి చేకూరినట్లు సమాచారం. అలాగే ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన గ్రామీణ లింకురోడ్లను సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేసే పనుల్లోనూ ఇదేతంతు నడిచింది.

ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద కందుకూరు నియోజకవర్గంలో నిర్మిస్తున్న గ్రామీణ లింకురోడ్ల నిర్మాణంలో నిర్దేశిత నాణ్యతాప్రమాణాలు పాటించటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఎన్‌హెచ్ 167బీ నుంచి మహదేవపురం, ఎన్‌హెచ్ 167బీనుంచి పలుకూరు, పోకూరు - శింగమనేనిపల్లి, కళవళ్ల - వీఆర్ కోట, ఎన్‌హెచ్ 167బీ నుంచి రేళ్లపాడు, ఎన్‌హెచ్ 167బీ నుంచి కొండసముద్రం గ్రామాలకు, కేజీటీ రోడ్డు నుంచి కేజీటీరోడ్డు వయా కొండముడుసు పాలెం ఎస్సీ కాలనీ రోడ్డును రమారమి రూ.11 కోట్ల వ్యయంతో పనులు చేయగా ఒక్క కొండసముద్రం రోడ్డు మినహా మిగిలిన రోడ్లన్నీ పూర్తయ్యాయని అధికారులు ఎం బుక్‌లు నమోదు చేశారు. అయితే ఈ రోడ్లలో ఏ ఒక్క రోడ్డులోను సైడ్‌బర్మ్‌లకు గ్రావెల్ తోలలేదు. రోడ్డు నిర్మాణం జరిగాక సైడు కాలువల్లోని మట్టిని ఎత్తి బర్మ్‌లలో పోసివదిలేశారు కానీ కనీసం రోలింగ్‌కూడా చేయలేదు. దీంతో రోడ్డు మార్జిన్ దిగితే ద్విచక్రవాహనదారులు స్కిడ్ అయి పడిపోతున్న దుస్థితి. భవిష్యత్తులో వర్షాలు కురిస్తే మరింత ఇబ్బంది అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక కొన్నిచోట్ల నిధులు కేటాయింపులోను అధికారులు కాంట్రాక్టర్ల ప్రభావంతో అధిక అంచనాలు వేసి అవసరం లేని పనులు చేయించిన పరిస్థితి. మహదేవపురం రోడ్డు కేవలం 1.5 కిలోమీటర్లు కాగా దానికి 1.5 కోట్లు కేటా యిస్తూ అంచనాలు రూపొందించిన అధికా రులు ప్రతిచేనుకు అప్రోచ్‌లు వేయించటం విశేషం. పోనీ అవి నిర్ధేశిత ప్రమాణాలతో అన్నా వేయించారా అంటే తూతూమంత్రంగా వేసి కొలతలు నమోదుచేశారు.

- ఇక కళవళ్ల నుంచి వీఆర్ కోటకు తారురోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచిన అధికారులు తీరా సగందూరం మాత్రమే పనిచేయించి నిధులు ఖర్చయిపోయాయనిపించటం విమర్శలకు తావిస్తోంది.
- అలాగే పోకూరు - శింగమనేనిపల్లి రోడ్డుదీ ఇదే పరిస్థితి. పోకూరు నుంచి సింగమనేనిపల్లికి తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పోకూరు వైపు 300 మీటర్లు, శింగమనేనిపల్లి వైపు 700 మీటర్లు వదిలేసి నిధులు ఖర్చయిపోయాయని బిల్లులు చేసేయడం విశేషం. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాలలో నిర్మించిన సిమెంటు రోడ్లదీ ఇదే పరిస్థితి. ఎక్కడా బర్మ్‌లకు గ్రావెల్‌తోలిన దాఖలాలు లేకపోయినా అధికారులు ఆ బిల్లులు కూడా పూర్తిచేసేయటం విశేషం. ఉన్నతాధికారులు పరిస్థితిని పరిశీలించి బర్మ్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మైనారిటీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మండలంలో అర్హులైన వారికి సబ్సిడీ రుణాల మంజూరు కోసం ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రుణాలకు ముస్లిం, క్రిస్టియన్, బుద్ధిస్ట్, సిక్కు, జైన్, పార్సీలు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.9275
వెండి కిలో ధర రూ. 99,700
వెండి ఒక గ్రాము రూ.102.70

న్యూస్ బాక్స్

వెంగమాంబపురంలో వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురంలో శనివారం వైద్యాధికారి ఆయేషా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు, ఏఎన్ఎం కవిత, ఆశలు పాల్గొన్నారు.

29న మండల సమావేశం

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మల్లికార్జున శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

అధ్వానంగా బస్‌షెల్టర్లు

● నిలువ నీడలేక ప్రయాణికుల అవస్థలు

ఆత్మకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు తల దాచుకునేందుకు నిర్మించిన బస్‌షెల్టర్లు నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారై కంపు కొడుతున్నాయి. దీంతో చెట్ల నీడన తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం, ఏఎస్ పేట, చేజర్ల, మర్రిపాడు, ఆత్మకూరు, సంగం మండలాల్లో నిపలు గ్రామాల్లో నిర్మించిన బస్‌షెల్టర్లు నిర్వహణకు నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకెళ్లే ప్రయాణికులకు నిలువ నీడలేక చెట్ల కింద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు మండలంలో నువ్వూరుపాడు, అశ్వనీపురం, జంగాలపల్లి, దేపూరు గ్రామాల్లో రోడ్డు పక్కనే నిర్మించిన బస్‌షెల్టర్లు నిర్వహణ కొరవడి ప్రయాణికులు కూర్చునేందుకు అనువుగా లేక అధ్వానంగా మారాయి. ఏఎస్‌పేట మండలంలో తాతిరెడ్డి పాళెం, పొనుగోడు, చౌట భీమవరం తదితర గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి నుంచి ప్రయాణికులకు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంతదూరం నుంచి రాకపోకలు సాగించిన ప్రయాణికులు సేద తీరేందుకు ఉన్న బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారడంతో చెట్లనీడన ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అనంత సాగరం, చేజర్ల తదితర మండలాల్లో సైతం బస్‌షెల్టర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.



తాతిరెడ్డిపాళెం సమీపంలో అధ్వానంగా ఉన్న బస్‌షెల్టర్

దుర్గంధం వెదజల్లుతున్న బస్ షెల్టర్లు

ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్ల నిర్వహణను అటు అధికారులు, ఇటు గ్రామ పంచాయతీలు గాలికి వదిలేశాయి. శుభ్రంచేసేవారు లేకపోవడంతో చెత్తాచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రయాణికులు ఆ బస్ షెల్టర్ ప్రాంగణంలో నిలబడలేని పరిస్థితి నెలకొంది. మూత్రశాలలు లేవు. కనీసం తాగునీటి సౌకర్యం లేదు. విద్యుత్ దీపాలు లేవు. రాత్రి అయిందంటే పలు బస్‌షెల్టర్ల పరిసరాల్లో అంధకారం అలుముకుంటుంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి బస్‌షెల్టర్ల అభివృద్ధిపై దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

● రూ. 7 లక్షల విలువచేసే సొత్తు స్వాధీనం
● నిందితులకు రిమాండ్



స్వాధీనపు సొత్తును ప్రదర్శిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

ఆత్మకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బంగారు దుకాణం యజమాని నుంచి నగల బ్యాగు దొంగిలించిన కేసులో ఇద్దరు నిందితులను ఆత్మకూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.7లక్షల విలువైన చోరీ సొత్తును రికవరీ చేశారు. ఈ మేరకు కార్యాలయంలో ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ నిందితులను విలేకర్ల సమావేశంలో హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. మార్చి 31న పట్టణంలోని బజార్‌లో చేజర్ల రమణమూర్తి అనే బంగారం వ్యాపారి రాత్రి 9 గంటల సమయంలో దుకాణం మూసేందుకు నగల బ్యాగును కింద పెట్టి షట్టర్ వేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి నగల బ్యాగును అపహరించి పరారయ్యారు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు డీఎస్పీ వేణుగోపాల్ నేతృత్వంలో సీఐ గంగాధర్ ఏర్పాటు చేసిన స్పెషల్ టీమ్ శనివారం బోయిళ్ల చిరువెళ్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న గుడివాడకు చెందిన మంగయ్య, పల్నాడు జిల్లాకు చెందిన ఓటేరి సాయి అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఆత్మకూరులో నగల బ్యాగు దొంగతనం విషయం వెలుగు చూసింది. దీంతో నిందితుల నుంచి సుమారు రూ.7లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈకేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అనతి కాలంలోనే నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రికవరీ చేసిన సీఐ గంగాధర్, ఎస్ఐలు జిలాని, సాయిప్రసాద్‌తోపాటు స్పెషల్ టీమ్ పోలీసులను డీఎస్పీ వేణుగోపాల్ అభినందించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

ఉదయగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో మండల పూజా కార్యక్రమాలను భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మి చెట్టు వద్ద ఆడపడుచులు ప్రత్యేక పూజలు చేపట్టి పొంగళ్లు నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి కాయాకర్పూరం అందజేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భక్తులకు పాముల సుబ్బరాయుడు దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాముల రమణయ్య భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవానికి ప్రముఖులకు ఆహ్వానం



మంత్రి ఆనంకు ఆహ్వానపత్రిక అందిస్తున్న టీడీపీ నేతలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించే అంకాళమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా శనివారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వానం అందజేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, మాజీ శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్‌లను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ఆస్తి అమ్మేసి, ఇంటినుంచి గెంటివేత

● వడ్లపూడిలో ఘటన
● పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



బాధితురాలు రావూరి రమణమ్మ

మనుబోలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వడ్లపూడిలో 60ఏళ్ల పైబడిన వృద్ధురాలు రమణమ్మను ఆమె మరిది రావూరి చంద్రయ్య కుటుంబసభ్యులు ఇంటినుంచి గెంటేశారు. ఇంటికి తాళం వేసి గ్రామం నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆ వృద్ధురాలు చేసేదిలేక నాలుగురోజులుగా అన్నపానాలు లేక విరిగిన కాలుతో రోదిస్తూ ఇంటి ముందు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న రమణమ్మ తమ్ముడు రామకృష్ణ శనివారం గ్రామానికి చేరుకుని అక్కతో కలిసి పోలీసుస్టేషన్‌కు వెళ్లి జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. రావూరి రాఘవయ్య, రమణమ్మలు భార్యాభర్తలు. వీరికి పిల్లలు లేరు. రెండున్నర ఎకరా పొలం ఉంది. ఇందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. అనారోగ్యంతో రమణమ్మ భర్త ఈ నెల రాఘవయ్య 6వ తేదీన మరణించాడు. దీన్ని అలుసుగా తీసుకుని రాఘవయ్య తమ్ముడు చంద్రయ్య రమణమ్మకు తెలియకుండా రాఘవయ్య పొలం అమ్మేశాడు. ఆ డబ్బుతో భార్య, పిల్లలతో నెల్లూరుకు వెళ్లాడు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



భూసార పరీక్షలు నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలరేగడ, భైరవరం గ్రామాల్లో శనివారం ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి అంజనేయులనాయక్ వరికి ప్రత్యామ్నాయ పంటల సాగు, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమైనందున భూసారం కోల్పోకుండా అదును బట్టి ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకొని సాయిల్ హెల్త్‌కార్డులు పొందాలన్నారు. అనంతరం వర్షాధార, ఆరుతడి పంటలపై, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ప్రభుత్వ పథకాలు అందించాలి

వింజమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలందరికీ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన పథకాలను అందించాలని ఎంపీడీవో కె శ్రీనివాసరెడ్డి తెలిపారు. మే నెల 1వ తేదీ నాటికి ఈ కార్యక్రమం పూర్తిచేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఉపాధి హామీ కూలీలందరికీ ప్రీమియం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 18 నుంచి 70 సంవత్సరాల లోపు వారు సంవత్సర చందాగా రూ.20 చెల్లించి సభ్యులుగా చేరవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2లక్షలు నామినీకి అందజేయబడుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి సురక్ష యోజన పథకం కింద 18 నుంచి 50 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు సంవత్సరానికి రూ.436 చెల్లించి సభ్యునిగా చేరాలన్నారు. ఈ పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.2లక్షలు నామినీకి అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎంపీడీవో కోరారు.

మాతమ్మ ఆలయంలో హుండీ చోరీ



దొంగలు పగలగొట్టిన హుండీ

కలువాయి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పర్లకొండ గ్రామంలోని మాతమ్మ ఆలయంలోని హుండీని శుక్రవారం రాత్రి దొంగలు అపహరించారు. ఆలయం తలుపులు తెరిచి హుండీ తాళం పగలగొట్టి అందులో ఉన్న రూ.10వేల నగదు అపహరించారు. హుండీని ఆలయ సమీపంలో పడేసి వెళ్లిపోయారు. శనివారం ఉదయం చోరీ జరిగిన విషయం గుర్తించిన పూజారి పూలే చిన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రమణయ్య తెలిపారు.

ఏఎస్ పేటలో గెస్ట్‌హౌస్‌లు, లాడ్జీల తనిఖీ



తనిఖీలు చేస్తున్న సీఐ వేమారెడ్డి

ఏఎస్ పేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): యాత్రా స్థలమైన ఏఎస్ పేటలో శనివారం సంగం సీఐ వేమారెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అద్దె రూములు, గెస్ట్‌హౌస్‌లు, లాడ్జిలను తనిఖీ చేశారు. అపరిచిత వ్యక్తులకు రూములు ఇవ్వరాదని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భాస్కర్‌రెడ్డి, టిడిపి నాయకులు షేక్ జిలానిబాషా తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండలవ్యాప్తంగా నీటి ఎద్దడిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు పనులు కల్పించాలని, ఎండలకు కూలీలకు మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వలసల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కాగా, మూడునెలల కాలంలో వెలుగు, విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, పారిశుధ్యం, హౌసింగ్ తదితర శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఎంపీడీవో భాస్కర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శారమ్మ, ఎంపిటిసి పిసి అల్లూరు రాజు, ఎంఈవో మస్తాన్‌వలి, ఈవోపిఆర్డి భార్గవి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):అక్రమ రవాణా, అసాంఘిక కార్య కలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లావ్యాప్తంగా లాడ్జీలు, ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. బాంబు స్క్వాడ్ సిబ్బంది బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో శనివారం అణువణువుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. లాడ్జీల యాజమానులు అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, లాడ్జీ పరిసర ప్రాంతాలు స్పష్టంగా కన్పించేలా తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. చట్టవిరుద్ధ, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ మద్యపానం గురించి సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

● **నెల్లూరురూరల్ :** ముత్తుకూరు రహదారికి ఆనుకుని ఉన్న పలు లాడ్జీల్లో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ గుంజి వేణు మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టామని తెలిపారు. అలాంటి వ్యక్తులు తటస్థపడితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. నేరనియంత్రణలో భాగంగా ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. లాడ్జీల్లో తరుచూ ఆకస్మిక తనిఖీలు జరుగుతూనే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజేష్

సంగం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సంగం-ముంబయి జాతీయ రహదారి కూడలిలో వెళ్లే వాహనాలను ఎస్ఐ రాజేష్ శనివారం సాయంత్రం నిలిపి తనిఖీ చేశారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లతోపాటు వాహనం పర్మిట్, లైసెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ తదితర సర్టిఫికెట్‌లను పరిశీలించారు. లేనివారిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో పోలీసులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి

అనంతసాగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అణచివేయాలని అనంతసాగరంలో శనివారం సాయంత్రం రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ముస్లింలు నిరసన ర్యాలీ చేశారు. ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. కశ్మీర్‌లో యాత్రికులపై జరిగిన దాడి అమానుషమని ముష్కరులను వేటాడి హతమార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు పాల్గొన్నారు.

50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

అనంతసాగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల అగ్రికల్చర్ అధికారి శ్రీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. 115 క్వింటాళ్ల జీలుగలు, 33 క్వింటాళ్ల జనుములు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఉద్యాన పంటల సాగుపై వీఏఏలకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి జయశ్రీ

సీతారామపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రంలో శనివారం మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, ఉద్యాన అధికారి జయశ్రీ ఆధ్వర్యంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఉద్యాన పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యాన శాఖ తరపున పండ్లు, పూలతోటల పెంపకం, హైబ్రీడ్ కూరగాయలు, పామాయిల్ సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలో నిరుపయోగంగా ఉన్న బీడు భూములలో ఉద్యాన పంటలు పెంచాలని, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రైతులకు ఉద్యాన శాఖ, ఉపాధి హామీ పథకాల గురించి వివరించి దరఖాస్తులు స్వీకరించాలని వీఏఏలకు సూచించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

● ఉత్తుత్తి కాల్ లెటర్లు ● రూ.6.45లక్షల స్వాహా

సంగం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ముగ్గురు యువకులను మోసంచేసిన సంఘటన దువ్వూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలాఉన్నాయి. దువ్వూరుకు చెందిన భరత్, హరీష్, అఖిల్‌లు బీటెక్ చేసి ఉద్యోగవేటలో ఉన్నారు. ఏడాది కిందట కలిగిరి శ్రీనివాసులు, కందుకూరు శ్రీకాంత్‌లు పరిచయమయ్యారు. ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి గత ఏడాది జూలైలో ముగ్గురు యువకుల నుంచి రూ.6.45లక్షలు వసూలు చేశారు. కొద్దిరోజుల వరకు అదిగో కాల్‌లెటర్.. ఇదిగో కాల్‌లెటర్ అంటూ కాలాయాపన చేశారు. తీవ్రంగా వత్తిడి చేయడంతో కాల్‌లెటర్లు పంపించారు. దీంతో సదరు కంపెనీలకు వెళ్లి విచారించగా అవి ఉత్తుత్తి కాల్ లెటర్లని తెలిసింది. దీంతో తాము చెల్లించిన నగదు తిరిగి ఇచ్చేయాలని బాధితులు డిమాండ్ చేయడంతో వారు ముఖం చాటేశారు. తాము మోసపోయామని తెలుసుకుని బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శివారు ప్రాంతాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేయాలి



శివారు ప్రాంత ఖాళీ స్థలంలో పెరిగిన కంపచెట్లు

వింజమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వేసవి కాలంలో పశువులకు తాగునీరు లేక అలమటిస్తున్నాయని, ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా ఈ కుంటలు ఏర్పాటుచేస్తే ఇటు పశువులకు అటు తాగునీటికి ఉపయోగపడుతుందని అంటున్నారు. శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల్లో కంప చెట్లు మొలిచి అడవులను తలపిస్తున్నాయని, వాటిని తొలగించి నీటి కుంటలు ఏర్పాటుచేస్తే ఆక్రమణల బారి నుంచి కాపాడుకోవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల ప్రజలకు అనుకూలంగా ఉండేలా చెన్నై, నెల్లూరు పట్టణాలకు బస్సు సౌకర్యం కల్పించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో ప్రకాశం జిల్లా పామూరు నుంచి వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి, ఉదయగిరి మండలం గండిపాళెం మీదుగా ఉన్న చెన్నై సర్వీసును యధావిధిగా కొనసాగిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే పెద్దిరెడ్డిపల్లి నుంచి నెల్లూరుకు వెళ్లే సర్వీసును రద్దు చేయడంతో ఆయా మండలాల వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా పట్టణాలకు బస్సు సర్వీసులను కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'చేజర్ల'కు సన్మానం

ఉదయగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన చేజర్ల సుబ్బారెడ్డిని శనివారం తన నివాసంలో వైసీపీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, సర్పంచ్‌లు గౌస్‌మొహిద్దీన్, తిరుపతయ్య, పాల్గొన్నారు.



చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 425

7 నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

ఉలవపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులో వెలసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు మే 7 నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని దేవస్థానం కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్త సుధీష్‌చంద్రారెడ్డిలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు పుర వీధుల్లో ఊరేగింపు జరుగుతుందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఏడాది రథోత్సవం నిర్వహించడం లేదని పేర్కొన్నారు. మిగిలిన వాహన సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు యధావిధిగా జరుగుతాయన్నారు. శతాబ్దం కాలం పైబడిన స్వామివారి రథం కలప పూర్తిగా దెబ్బతిన్నందున ప్రమాద సంఘటనలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఎండోమెంట్ విభాగం సాంకేతిక నిపుణులు రథం పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారని తెలిపారు. దీంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రేయోభి నిధి నుంచి రూ.80 లక్షలు నిధులు నూతన రథం తయారీకి మంజూరు చేశారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయిందని, త్వరలోనే నూతన రథం నిర్మాణ పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

మాలకొండ ఆదాయం రూ.9,36,412

వలేటివారిపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.9,36,412 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్లు రూ.6,300, కుంకుమార్చనకు రూ.16,280, వివాహములకు రూ.2 వేలు, తలనీలాలకు రూ. 55,825, వాహనపూజలకు రూ. 3,160, ప్రత్యేకదర్శనానికి రూ.3,51,400, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.280, రూముఅద్దెలు రూ.31,910, కవర్లకు రూ.8,700, లడ్డూప్రసాదంకు రూ.2,02,195, అన్నదానానికి రూ.2,57,132, విరాళములు రూ.1,230 వచ్చిందని తెలిపారు.

పాలీసెట్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఈనెల 30న నిర్వహిస్తున్న పాలీసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు రాష్ట్రప్రభుత్వ అధికారిక పాలీసెట్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రాలకు రావాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. 30న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని అభ్యర్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం

బిట్రగుంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో శుక్రవారం రాత్రి లోకో రామాలయ ప్రాంగణంలోని పరమేశ్వరుడు, పార్వతి దేవి ఆలయాల గ్రిల్‌కు వేసి ఉన్న తాళాలను విరుగగొట్టి చోరీకి యత్నం చేశారు. అలికిడి వినిన ఆలయ పూజారి నరేష్ ఆచార్యులు బయటకు రావడంతో దొంగలు పరార్ అయ్యారు. అలాగే బోగోలు పాత ఆంధ్రాబ్యాంక్ సమీపంలో ఉంచిన బైక్‌ను చోరీ చేశారు. ఈ విషయమై ఎస్‌ఐ బోజ్యను వివరాలు కోరగా బైక్ చోరీపై ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

పశువుల నీటితొట్టె నిర్మాణం పూర్తి

కొండాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలో వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా చేపట్టిన నీటితొట్టె నిర్మాణం పూర్తయింది. ఈసందర్భంగా గ్రామ టీడీపీ నాయకుడు జాగర్లమూడి శ్రీనివాసులు మాట్లాడుతూ మూగజీవాలు, పశువులు వేసవిలో నీటి కోసం ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆదిమూర్తిపురంలో రూ.30 వేలతో నీటితొట్టెను నిర్మించి శనివారం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఐతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

కందుకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇండియాలో ఇప్పుడేం చేయాలి అన్న పుస్తకావిష్కరణ సభ ఈనెల 28న పట్టణంలోని స్వర్ణ ప్యాలెస్‌లో జరుగుతుందని సాహిత్యాభిమానులు, చరిత్రాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీడీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గేరా చిరంజీవి కోరారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో పుస్తకావిష్కరణ కరపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించారు.

తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్య

● ఆలస్యంగా వెలుగులోకి...

కొండాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కొండాపురం ఎస్సీ కాలనీలో తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన రావూరి సుప్రియ(11) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కాలనీకి చెందిన రావూరి ఆనంద్, భార్య మాధవి కుటుంబ కలహాల నేపథ్యంలో 5 ఏళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తల్లివద్ద ఉంటున్న కుమార్తె సెలవులకు బుధవారం తండ్రి వద్దకు వచ్చింది. గురువారం ఆనంద్ ఆధార్ సెంటర్‌కు వెళుతుండగా తాను వస్తానని కుమార్తె పట్టుబట్టింది. దీంతో తండ్రి మందలించాడు. అతను తిరిగి ఇంటికివచ్చేసరికి సుప్రియ ఇంట్లో రాడ్డుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న తల్లి మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కలిగిరి సీఐ వెంకట నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులు తవ్వేస్తున్నారు..!

లింగసముద్రం మండలంలోని సాగునీటి చెరువులను మట్టి, గ్రావెల్ మాఫియా, రియల్టర్లు కుళ్ల బొడిసేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్లతో తవ్వి ట్రాక్టర్లతో యథేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇక్కడ తవ్విన మట్టి, గ్రావెల్‌ను లేఅవుట్లకు తరలిస్తూ లక్షలు గడిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో చెరువుల్లో ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతుండడంతో సాగునీటికి ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

- లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)



పెదపవని చెరువులో ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వడంతో ఏర్పడిన గుంతలు

- యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా
- లేఅవుట్లకు తరలిస్తున్న వైనం
- పెద్ద పెద్ద గోతులతో మారుతున్న రూపురేఖలు
- సాగునీటి ఇబ్బందులు తప్పవని రైతుల ఆందోళన
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

మండలంలోని పెదపవని, చినపవని, లింగసముద్రం, మొగిలిచెర్ల, మాలకొండ రాయునిపాలెం తదితర గ్రామాల్లోని చెరువుల్లో మట్టి, గ్రావెల్‌ను అక్రమార్కులు జోరుగా తరలిస్తున్నారు. ముఖ్యంగా పెదపవని, లింగసముద్రం గ్రామాల్లోని చెరువుల్లో గ్రావెల్‌ను ఎక్స్‌కవేటర్‌లతో తవ్వి, ట్రాక్టర్‌ల ద్వారా వెంచర్లకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ గ్రావెల్‌ను రూ.500 నుంచి రూ.600 విక్రయిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా పెదపవనిలో పగలు రాత్రి కూడా చెరువులోని గ్రావెల్‌ను జోరుగా వెంచర్లకు తరలిస్తున్నారు. లింగసముద్రంలోని కొత్త చెరువులో సెలవు దినాలు, ఆదివారాల్లో గ్రావెల్‌ను తవ్వి వెంచర్లకు, ఇళ్ల వద్ద మెరక పేరుతో తరలిస్తున్నారు. చెరువుల్లోని మట్టి, గ్రావెల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వి తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంచూ ప్రభుత్వానికి సీనరేజ్ కూడా చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయమై మైనర్ ఇరిగేషన్ ఏఈ త్రివిక్రమ్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి, గ్రావెల్ తవ్వి తరలిస్తే కేసులు నమోదు చేయించి, వాహనాలు సీజ్ చేయిస్తామని హెచ్చరించారు.

ఉగ్రవాదుల దాడులు బాధాకరం



కావలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సీపీఎం, ప్రజాసంఘాల నేతలు

కావలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడులు బాధాకరమని పలువురు నాయకులు పేర్కొన్నారు. కశ్మీర్ ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ట్రంకు రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ఉగ్రవాదులు 28 మంది పర్యాటకులను కాల్చి చంపటాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కాల్పులలో కావలి పట్టణానికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు చనిపోవటం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్, సీపీఎం నాయకులు వై.కృష్ణమోహన్, బీ.రమణయ్య, ప్రజాసంఘాల నాయకులు పీ.వెంకటేశ్వర్లు, మేడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ప్రదర్శన

కందుకూరు : పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శనివారం సాయంత్రం కందుకూరులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధులలో జరిగిన ఈ ర్యాలీలో యూటీఎఫ్ కార్యకర్తలకు సంఘీభావంగా సీఐటీయూ, ఐద్వా ప్రతినిధులు, పెన్షనర్లు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ముప్పరాజు కోటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు మున్వర్‌సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రమూకల దాడి హేయం

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడులు చేసి అమాయకుల ప్రాణాలు తీయటం హేయమైన చర్య అని, మతం పేరుతో ఇలాంటి దాడులు చేయటం అమానవీయం, పిరికిపందల చర్య అని జైభారత్ ముస్లిం రెవల్యూషనరీ ఫోరం కో కన్వీనర్ ఖదిజ్జాసి అబ్దుల్ రహిమాన్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. మతాన్ని అడ్డుపెట్టుకుని అమాయక ప్రజల మీద చేస్తున్న దాడులను అందరం కలిసి కట్టుగా ఎదుర్కోవాలని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టించటమే భారతీయుల లక్ష్యంకావాలని ఆయన పేర్కొన్నారు. పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలను కాపాడేక్రమంలో తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన సయ్యద్ ఆదిల్‌హుస్సేన్ షాకు, ఉగ్రమూకల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు ఆయన నివాళులర్పించారు.

కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ



వలేటివారిపాలెంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు



కందుకూరులో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న యూటీఎఫ్, ఐద్వా నాయకులు, మహిళలు

వలేటివారిపాలెం : కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా వలేటివారిపాలెంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఉప్పుటూరి కొండపనాయుడు ఆధ్వర్యంలో శనివారం శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపనాయుడు మాట్లాడుతూ ఉగ్రదాడిలో మృతి చెందిన వాళ్లకు నివాళులర్పిస్తునట్లు తెలిపారు. దేశసార్వభౌమాధికారం దెబ్బతీసే ఇలాంటి దాడులకు భయపడకుండా ప్రతిఘటించాలని కోరారు. ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కార్యదర్శి ప్రభాపతి గోపాల్, భజరంగదల్ సుబ్రహ్మణ్యం, మాతృశక్తి అరుణ, న్యాయవాది ప్రగడ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో...

బిట్రగుంట : బోగోలులో శనివారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కశ్మీర్‌లో ఉగ్ర దాడులను ఖండిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బోగోలు కూడల్లో ప్రారంభమైన ర్యాలీ బీజేపీ కార్యాలయం మీదుగా రైల్వే ఎల్సీగేట్ 144 నుంచి టీడీపీ కార్యాలయం వరకు సాగింది. ఇలాంటి ఘటనలను తీవ్రంగా ఖండించాలని నినదించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ, బీజేపీ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, వీరాల శ్రీనివాసులు యాదవ్, నాయకులు ఎల్.సుధీర్‌బాబు, ఎన్‌ఎస్‌యాదవ్, పీ.సుధాకర్, బీ.ప్రభాకర్, అహ్మద్‌బాషా, డీ.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టండి

● డీఏవో సత్యవాణి



రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న డీఏవో సత్యవాణి

అల్లూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్, రబీ సీజన్లకు అత్యధికంగా వరిపైనే ఆధారపడిన రైతులు వీటికి ప్రత్యామ్నాయంగా ఖరీఫ్‌లో జనుము, జీలుగ, పిల్లిపెసర పంటలను వేసుకోవడం ఉపయోగకరమని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి అన్నారు. మండ లంలోని బీరంగుంటలో శనివారం నిర్వహిస్తు న్న భూసార పరీక్ష నమూనాల సేకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయమంటే కేవలం వరి మాత్రమే కాదని ఇతర పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదేవిధంగా భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా రైతుల పొలంలో ఉన్న సూక్ష్మధాతువులు వివరాలు తెలుస్తాయని తద్వారా ఎరువులు వినియోగం, యాజమాన్య పద్ధతుల సులభతరంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను వినియోగించుకోవాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జిహారిక

బిట్రగుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఆధార్ ఉండాలన్న లక్ష్యంతో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ చొరవతో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు సురేష్ బాబు కోరారు. శనివారం బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాల్‌లో ఎంపీపీ సుజాత అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారసత్వం, చుక్కల భూముల నోషన్ ఖాతా నెంబర్లను సరిచేయించుకునేందుకు వీఆర్వోలను సంప్రదించాలన్నారు. రైతులు నీటి పన్ను చెల్లింపులో ప్రజాప్రతిధులు కూడా అధికారులకు సహకారం అందించాలని కోరారు. కోవూరుపల్లి వైద్య అధికారిని జిహారిక మాట్లాడుతూ పెరుగుతున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లు, సచివాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కీర్తన, మండల ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు



బాధ్యతలు చేపడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

కావలిటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పీజీ సెంటర్ స్పెషల్ ఆఫీసర్‌గా, ప్రిన్సిపాల్‌గా, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్‌గా, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా వీఎస్‌యులో అనేక బాధ్యతలు చేపట్టారు. బోధన, పరిశోధన విభాగాల్లో 30 ఏళ్ల అనుభవం కలిగిని ఈయన 14 పుస్తకాలు రచించడమేకాక వివిధ జాతీయ అంతర్జాతీయ పత్రికల్లో 39 పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. 3 జాతీయస్థాయి సెమినార్‌లు నిర్వహించారు. అనేక ప్రాజెక్టులు పూర్తి చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అధ్యాపకులు, సిబ్బంది పుష్పగుచ్చాలు, జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కాగా ఇటీవల కళాశాలలో అనేక వివాదాలు చోటు చేసుకోవడంతో పెద్దఎత్తున మీడియాలో దుమారం లేసి యూనివర్శిటీ పెద్దలకు తలనొప్పిగా మారిన నేపథ్యంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన చిలుమూరి ఈ సవాళ్లను ఎలా ఎదుర్కొంటారో వేచి చూడాల్సిందే.

వేసవిలో రక్తం కొరత నివారణకు రక్తదానం



రక్తదానం చేస్తున్న డాక్టర్ ఉమాచంద్, తదితరులు

కావలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో రక్తం కొరత నివారించేందుకు తమ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారని డాక్టర్ ఉమాచంద్ తెలిపారు. కావలి పట్టణ డాక్టర్ ఉమాచంద్ ఆసుపత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 44 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ మేఘనాథ్, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, డాక్టర్ ఫయాజ్, పీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే. హరినారపరెడ్డి పాల్గొన్నారు.

కావలిటౌన్ : హ్యాపీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సంస్థ క్రియాశీలక సభ్యులు మారుబోయిన నాగరాజు, నీలిమ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భగా ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, జాగో సంస్థ అధ్యక్షుడు జమీర్, పూల చాన, భరత్‌కుమార్, స్టాఫ్‌నర్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ

కావలి : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఆదివారం పంపిణీ చేసేందుకు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు సిద్ధం చేశారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డు మినీ స్టేడియంలో పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి పాల్గొంటారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

కొత్త వ్యక్తుల సమాచారమివ్వాలి : డీఎస్పీ



తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న సరైన పత్రాలు లేని బైక్‌లు, ఆటోలు

కావలి రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీస్ డయిల్ 112కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. కావలి పట్టణంలోని పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీలో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 55 బైక్‌లు, 3 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. 45 మంది వేలిముద్రలు సేకరించి వారిలో అనుమానితులుగా ఉన్న ఇద్దరు పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారించి పంపించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీతో పాటు 1వ, 2వ పట్టణ, రూరల్, సర్కిల్ సీఐలు ఫిరోజ్, గిరిబాబు, రాజేశ్వరరావు, పాపారావు, 10 మంది ఎస్ఐలు, 50 మంది సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

బిట్రగుంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టాలని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు పీ.చెంచయ్య, కార్యదర్శి పీ.గోవిందరాజులు కోరారు. బోగోలులోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బిట్రగుంట పరిధిలో 1200 మందికిపైగా రైల్వే విశ్రాంత ఉద్యోగులు ఉన్నారన్నారు. రైల్వేకు సంబంధించిన వందలాది ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయని, వందేభారత్ రైలుకు సంబంధించిన యూనిట్ ఏర్పాటు చేస్తే మంచిదన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే బిట్రగుంట రైల్వే అభివృద్ధికి కృషి చేస్తున్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య దృష్టి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ చైర్మన్ నూకసాని శ్రీనివాసులు, కోశాధికారి ఎస్.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు బి.రాజన్న, విజయకుమార్, ఉపాధ్యక్షులు సీహెచ్.రమణయ్య, జే.యలమందయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

● ఎం.నారాయణ, ఎస్ఐ, లింగసముద్రం



లింగసముద్రం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. తాను వచ్చి నెల రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాలను సందర్శించాను. అన్ని రాజకీయ పార్టీల నాయకులకు పోలీసులతో మమేకమై శాంతిభద్రతలకు సహకరించాలని కోరాను. నేరాల నియంత్రణకు, నేరస్తులను పట్టుకొనేందుకు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

? శాంతిభద్రతల పరిరక్షణ, జూదాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! గ్రామాల్లో పర్యటించి స్థానిక రాజకీయ పార్టీల నాయకులతో శాంతిభద్రతలపై చర్చించాను. పోలీసులకు సహరించకుండా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పేకాట, కోడి పందేలపై నిఘా పెట్టాం. పేకాట స్థావరాలపై దాడులు చేసి 17 మందిని అరెస్ట్ చేశాం. అసాంఘిక కార్యకలాపాలపై పూర్తిగా నిఘా ఉంచాం.

? నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి.

! నేరాల నియంత్రణకు గ్రామ నాయకుల సహకారంతో కొన్ని గ్రామాల్లో 53 సీసీ కెమెరా లు ఏర్పాటు చేశాం. మరికొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఒక్కో కానిస్టేబుల్‌కు కొన్ని గ్రామాలను కేటాయించి సమగ్ర సమాచారం సేకరిస్తున్నాం.

? డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్లు వాహనాలు నడపడంపై చర్యలు తీసుకుంటారా.

! డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం దాడులు చేపటడం ద్వారా ఈ నెల రోజుల్లో 15 మందిపై కేసులు నమోదు చేశాం. మైనర్లు వాహనాలు నడపడాన్ని గుర్తించాం. అందుకు ముందుగా వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం. అదే మళ్లీ మళ్లీ కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

? లింగసముద్రం బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యపై చర్యలేమిటి.

! బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుకు ఆనించి వాహనాలు నిలిపితే వారిపై జరిమానాలు విధిస్తున్నాము. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీనికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలి.

పేకాట స్థావరంపై దాడి

కావలి రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్ శివారులో పేకాట స్థావరంపై శనివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసులకుని వారి నుంచి రూ.1650 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరెడ్డి తెలిపారు.

గిరిజనుల డబ్బులకు లెక్కేది!?

- రాపూరులో భారీగా సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి
- డీఆర్‌డీఏ ఉద్యోగులే తినేసినట్లు నిర్ధారణ
- నెల రోజుల క్రితం నోటీసులతో సరి
- ఇప్పటికీ చర్యల్లేవు.. రికవరీ ఆలోచన లేదు!
- థర్డ్ పార్టీ విచారణతోనే మరిన్ని వాస్తవాలు

నెల్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభివృద్ధికి తీసుకొచ్చిన ఎస్టీ సబ్‌ప్లాన్‌ను కొందరు డీఆర్‌డీఏ ఉద్యోగులు కల్పతరువుగా మార్చుకున్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారికి చెందాల్సిన నిధులను దిగమింగారు. ఒక్క రాపూరు మండలంలోనే రూ.71 లక్షలుతినేసినట్లు తెలిసింది. ఈ లెక్కన చూస్తే ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఏ స్థాయిలో పక్కదారి పట్టాయోనన్న అనుమానాలు కలుగుతున్నాయి. రాపూరు యానాది మండల సమాఖ్య పరిధిలో 14 యానాది గ్రామ సంఘాలు(వీవో) ఉన్నాయి. వీటి పరిధిలోని యానాది పొదుపు మహిళల కోసం రూ.2.47 కోట్లు ఎస్టీ సబ్‌ప్లాన్ కింద మంజూరయ్యాయి. అయితే ఈ నిధులను డీఆర్‌డీఏ క్షేత్రస్థాయి సిబ్బంది పక్కదారి పట్టించినట్లు చాలా కాలం నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన మండల, క్లస్టర్, జిల్లా స్థాయి అధికారులు ఈ ఆరోపణలు పట్టించుకోకుండా అక్రమాలతో చేతులు కలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజనుల నిధులు పక్కదారి పట్టడంపై కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదులు అందాయి. ఒక్క సబ్‌ప్లాన్ నిధులే కాకుండా సీఐఎఫ్ వంటి ఇతర పథకాల నిధులు కూడా తినేసినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఒక్క రాపూరు మండలంలోనే సుమారు రూ.2 కోట్లకుపైగా పొదుపు మహిళల డబ్బులను తినేసినట్లు లెక్కలతో సహా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో 9 మందితో డీఆర్‌డీఏ పీడీ కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపించారు. యానాదులకు వాస్తవంగా రూ.1.76 కోట్లు మాత్రమే రుణాలుగా అందించారని, మిగిలిన రూ.71 లక్షలను వెలుగు సిబ్బంది పక్కదారి పట్టించారని విచారణలో తేలింది. అలానే సున్నా వడ్డీతో ఇచ్చిన ఈ సబ్‌ప్లాన్ రుణాలకు గిరిజనుల నుంచి వడ్డీలు కూడా వసూలు చేసినట్లు బయటపడింది.

● నాడు విచారణ.. నేడు చర్యలు ఆలస్యం

ఒక్క సబ్‌ప్లాన్ నిధుల్లోనే రూ.71 లక్షలు తినేశారంటే ఇక మిగిలిన పథకాల్లో ఎంత మేర తినేసి ఉంటారో ఊహించుకోవచ్చు. అయితే ఈ నివేదికను చూసిన కలెక్టర్ కూడా తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు రికవరీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు డీఆర్‌డీఏ అధికారులు పలువురు సీసీలు, ఏపీఎంలను బాధ్యులుగా చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఇది జరిగి నెల రోజులు గడిచినా ఇంతవరకూ ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోలేదు. పేదల డబ్బులు తినేసిన అక్రమార్కులు రాజకీయ నాయకుల ద్వారా ఒత్తిడి తీసుకొస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అసలు విచారణ కమిటీని ఏర్పాటు చేసినప్పటి నుంచే స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదుల చేశారు. డీఆర్‌డీఏ అధికారులతో కమిటీ వద్దని, థర్డ్ పార్టీతో విచారణ జరిపిస్తేనే వాస్తవాలు తెలుస్తాయని వారు కోరారు. అయితే వారి అనుమానాలకు బలం చేకూరుస్తూ విచారణ కమిటీ విచారణను చాలా ఆలస్యం చేసింది. కలెక్టర్ ఆదేశించి ఆయన పలుమార్లు అడిగాక ఎట్టకేలకు మూడు నెలల తర్వాత నివేదికను అందజేశారు. అదే మాదిరిగా ఇప్పుడు చర్యలు కూడా ఆలస్యమవుతున్నాయి. నిధులు సక్రమంగా సభ్యులకు చెందుతున్నాయో లేదో చూడాల్సిన అధికారుల బాధ్యతలను స్థానికులు నిర్వర్తించి అవకతవకలను గుర్తించారు. ఆ తర్వాత కూడా అధికారులు సక్రమంగా స్పందించకపోతుండడంతో మళ్లీ స్థానికులే గత సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం.



నోటీసులకు సమాధానం ఇచ్చారు

రాపూరు మండలంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై బాధ్యులకు నోటీసులు ఇచ్చాం. వారు సమాధానాలు ఇచ్చారు. తదుపరి చర్యలకు ఫైల్ సర్క్యులేట్ చేస్తున్నాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ



కోడి.. దాహంతో వెంపర్లాడి!

మండుతున్న ఎండలకు మనుషులే కాదు.. మూగ ప్రాణులూ అల్లాడిపోతున్నాయి. తిండి గింజలు లేక.. దాహం తీర్చుకోలేక వెంపర్లాడుతున్నాయి. నగరంలోని ఓ వ్యాపారి విక్రయానికి తీసుకొచ్చిన కోళ్లు దాహంతో విలవిల్లాడాయి. దీంతో వెంటనే ఓ సీసా నీటిని కొనుగోలు చేసి వాటి దాహం తీర్చాడు. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

పశువైద్యులు అంకితభావంతో పనిచేయాలి

● పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్ ● ఘనంగా ప్రపంచ పశువైద్య దినోత్సవం



రక్తదానం చేస్తున్న పశువైద్యులు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మూగజీవుల ఆరోగ్యం కోసం పశువైద్యులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే. రమేష్‌నాయక్ పేర్కొన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని శనివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో పశువైద్యులు, వారి కుటుంబ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశ జీడీపీని పెంచేందుకు పశుజాతులు, గొర్రెలు, కోళ్ల ఉత్పత్తి ఎంతో అవసరమని, అదిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వెట్ ఫార్మా కంపెనీ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ టీ.చలమయ్య మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం, వారి ఆర్థికాభివృద్ధికి సమిష్టిగా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విశ్రాంత పశువైద్యులు బ్రహ్మారెడ్డి, వేణుగోపాల్, నాగేశ్వరమ్మ, మురళీనాథ్‌ను సన్మానించారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సంబరాల్లో డీడీలు సోమయ్య, నాగమణి, మల్లారెడ్డి, శ్రీధర్‌రావు, ఏడీలు డాక్టర్ చైతన్యకిషోర్, మాలకొండయ్య, మాధవీలత, కృష్ణమౌర్యలతోపాటు పలువురు పశువైద్యులు, సిబ్బంది, ఆయా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేవుడి మాన్యం వేలంలో అవకతవకలు

● చిత్తలూరు గ్రామస్థుల ఆరోపణ

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చేజర్ల మండలం చిత్తలూరులోని చెన్నకేశవస్వామి, వీరభద్రస్వామి ఆలయాల భూములకు నిర్వహించిన వేలంలో అవకతవకలు జరిగాయని గ్రామస్థులు కూరపాటి భక్తవత్సలబాబు, టీ.వెంకటకృష్ణ, కే.మల్లికార్జున్‌నాయుడు, మరి కొందరు ఆరోపించారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఆయా ఆలయాలకు చిత్తలూరు, ఆదురుపల్లి, దొరువుపాడు, వావిలేరు గ్రామాల్లో భూములు ఉన్నాయని తెలిపారు. వాటికి వేలం గడువు 2023 మే నెలతో తీరిపోయిందన్నారు. ఆయా దేవస్థానాల్లో పనిచేస్తున్న పూజారికి ఆలయ అధికారి జీతాలు ఇవ్వడంలేదన్నారు. ఈ విషయమై గ్రీవెన్స్‌లో జేసీకి విన్నవించుకున్నామని తెలిపారు. 15రోజుల్లో పూజారికి జీతం చెల్లించాలని, దేవుడి మాన్యాలకు కూడా వేలం వేయాలని జేసీ ఆదేశించారని వారు వివరించారు. ఆలయ అధికారులు, స్థానిక అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై దేవుడి మాన్యాల వేలం గురించి గ్రామంలో దండోరా కూడా వేయకుండా హడావుడిగా వేలంనిర్వహించారని పేర్కొన్నారు. వేలం పాడిన రైతుల నుంచి పాట మొత్తం నగదును డిపాజిట్టుగా తీసుకోకుండా, 15రోజులు గడువు ఇచ్చారని, ఇది ఎంత వరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ఇప్పటికీ పూజారికి జీతాలు చెల్లించలేదన్నారు. మాన్యాల వేలం రద్దు చేసి తిరిగి నిర్వహించాలని వారు కోరారు. అధికార పార్టీ నేతలతో చేతులు కలిపి ఏకపక్షంగా వ్యవహరిస్తున్న దేవదాయ శాఖ అధికారులపై విచారణ చేపట్టాలని వారు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధిపై నివేదిక సిద్ధం చేయండి

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో కలెక్టర్‌తో మంత్రి ఆనం

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1న ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటనపై కలెక్టర్ ఆనంద్‌తో శనివారం దేవదాయ శాఖామంత్రి ఆనం రామ నారాయణరెడ్డి చర్చించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో రూట్ మ్యాప్, బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు. ఆత్మకూరు మండలం నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవం ఉంటుందని మంత్రి ఆనం పేర్కొన్నారు. మేడే సందర్భంగా ఆటో, గృహ నిర్మాణ, ఇతర కార్మికులతో సీఎం ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. నెల్లూరు పాళెం ఎస్టీ కాలనీలో పింఛన్ల పంపిణీ, ఏఎంసీ గ్రౌండ్‌లో ప్రజా వేదిక, పార్టీ కార్యకర్తల సమావేశం ఉంటాయని వివరించారు. ప్రజా వేదిక ఏర్పాట్లును మార్గదర్శకంగా చేయాలని సూచించారు. ఆత్మకూరు అభివృద్ధి, సమస్యలపై నివేదిక తయారు చేయాలన్నారు. శుక్రవారం రాత్రి నెల్లూరుపాళెం ఎస్టీ కాలనీని తాను సందర్శించానని, అక్కడ చాలామందికి ఇళ్లు లేవని, వెంటనే వారికి ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టరును కోరారు. యువతకు స్వయం ఉపాధిపై చర్యలు తీసుకోవాలన్నారు. సోమశిల జలాశయ మరమ్మతు పనులు, హైలెవల్ కెనాల్, తెలుగు గంగ పనులను సీఎం దృష్టికి తీసుకు వెళ్లేలా నివేదిక రూపొందించాలని సూచించారు. నగరంలో కలెక్టర్ భవనం, అధునాతన అతిథి గృహం, ఆత్మకూరులో బీసీ బాలి కల రెసిడెన్సియల్ పాఠశాల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆదూరుపల్లి రెసిడెన్సియల్ పాఠశాలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని, సంగంలో ఐటీఐ ఈ ఏడాది నుంచే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

విద్యుత్ వృథాను తగ్గించండి

● ఎస్పీడీసీఎల్ సీజీఎం ఆదిశేషయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిశేషయ్య

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కువగా లైన్‌లాస్ ఉందని, దీన్ని తగ్గించాలని విద్యుత్ శాఖ అధికారులను ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఆదిశేషయ్య ఆదేశించారు. జిల్లాకు వచ్చిన ఆయన శనివారం విద్యుత్ భవన్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైన్‌లాస్ వల్ల సంస్థకు ఎక్కువగా నష్టం వస్తున్నదని, దీన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 8వేల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండగా, ఒక్క సర్వీసుకు కూడా మ్యాపింగ్ చేయలేదని, మే 31లోగా అన్నీ సర్వీసులకు మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రతి ఫీడర్‌కు ఎనర్జీఆడిట్‌ను కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఎనర్జీఆడిట్‌ను నిర్లక్ష్యంచేస్తే సంస్థ మనుగడకే ప్రమాదమవు తుందని తెలిపారు. జిల్లాలో విద్యుత్ చౌర్యం జరగకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించుకుంటూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఈ విజయన్ మాట్లాడుతూ వ్యవసాయ సర్వీసులకు ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, ఇతర పరికరాలను ఎండీ మంజూరు చేశారని, వీటిని వినియోగించి, పెండింగ్‌లో ఉన్న సర్వీసులన్నింటిని మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సూర్యఘర్ నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, ఈఈలు లక్ష్మీనారాయణ, శ్రీధర్, బెనర్జీ, డీఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి క్రికెట్ వేసవి శిబిరం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ సహకారంతో మే 1 నుంచి నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రికెట్ వేసవి శిబిరాన్ని నిర్వహించనున్నామని అసోసియేషన్ కార్యదర్శి కే.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్టేడియంలోని క్రికెట్ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

సోమశిలలో 51.342 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శనివారం నాటికి 51.342 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఫారెన్ సర్వీసెస్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్షలో ఫారెన్‌సర్వీసెస్‌కు డిప్యుటేషన్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సెక్టోరియల్ ఆఫీసర్స్ విభాగంలో ప్లానింగ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్స్ విభాగంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్‌వో), అసిస్టెంట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్(ఉర్దూ ఏఎంవో), అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్(ఏఎల్ఎస్‌సీవో), అసిస్టెంట్ ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ (ఐఈసీవో) పోస్టులు భర్తీ చేస్తున్నామని వివ రించారు. ఆసక్తి, అర్హత కలిగిన స్కూల్ అసి స్టెంట్, ఎస్‌జీటీలు ఈనెల 26 నాటికి 55 ఏళ్ల లోపల ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాల న్నారు. ఈనెల 30వతేదీ సాయంత్రం ఐదు గంటలలోగా విద్యార్హత సర్టిఫికెట్‌లు, మార్కుల జాబితాలు, అనుభవం, ఇతర సర్టిఫికెట్‌లతో గజిటెడ్ సంతకం చేయించి, నేరుగా ఎస్ఎస్ఏ కార్యాలయంలో అందచేయాలని ఆయన తెలి పారు. మరిన్ని వివరాలకు www. deo nellore50 webs.com అనే వెబ్‌సైట్‌లో పరిశీలించాలని తెలిపారు.

వేదగిరిలో భక్తులకు ఏ లోటూ రానీయొద్దు

- భద్రత, పారిశుధ్యం, తాగునీరు ముఖ్యం
- బ్రహ్మోత్సవ సమన్వయ కమిటీ సమావేశంలో వక్తలు



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అనూష

నెల్లూరురూరల్, ఏప్రిల్ 26,(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్నీ శాఖల అధికారులు తోడ్పాటునందించాలని వక్తలు పేర్కొన్నారు. శనివారం వేదగిరిక్షేత్రం లో ఆర్డీవో అనూష, బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ ఈ. అచ్యుత శంకర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ వేదగిరి క్షేత్రంలో మే 6 నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు భద్రత, పారిశుధ్యం, తాగునీరు, ప్రయాణ సౌకర్యం, మెరుగైన వైద్యం కల్పించాలని కోరారు. వీఐపీ, వీవీఐపీల దర్శనాలను బాగా తగ్గించి సామాన్యులకు ఇబ్బందులు లేకుండా స్వామివార్ల దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గరుడసేవ, కల్యాణం, రథోత్సవాలకు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున, ఏడు కోనేర్ల వద్ద అగ్నిమాపక దళ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అలాగే భద్రతపై నిఘా పెట్టాలని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర సర్వీసులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఈవో గోపి, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

● తిరుపతిలో ఘటన



కొంగుముడుసు నాగరాజు (ఫైల్)

కొండాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత కుటుంబ సభ్యులు, పోలీసులు అకారణంగా దాడి చేశారన్న మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు కుటుంబ సభ్యుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. సాయిపేట పంచాయతీ కొమ్ము పాలెంకు చెందిన కొంగుముడుసు నాగరాజు (28) కొంత కాలంగా బేల్దారు పనులు చేసుకుంటూ భార్య సాయిప్రియ, 5 ఏళ్లలోపు ఇద్దరు పిల్లలతో కలిసి తిరుపతిలోని మంగళం బీటీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇటీవల నాగరాజు తమ్ముడు పోతురాజు దగదర్తి మండలం అనంతవరం గ్రామానికి చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లాడు. తిరుపతిలో ఉన్న అతని అన్న నాగ రాజు ఇంటకి వెళ్లాడన్న సమాచారంతో ఆ వివాహిత కుటుంబసభ్యులు, పోలీసులు శుక్రవారం అక్కడకు చేరుకున్నారు. అక్కడ పోతురాజు, ఆ మహిళ లేకపోవడంతో వారి ఆచూకి కోసం నాగరాజును ప్రశ్నించారు. ఆ విషయం తనకు తెలియదని చెప్పడంతో అతనిపై వివాహిత కుటుంబసభ్యులు, పోలీ సులు దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు అదేరోజు రాత్రి భార్య, పిల్లలు నిద్రపోతున్న సమయంలో ఉరి వేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విష యాన్ని భార్య సాయిప్రియ ఫోను ద్వారా కుటుంబ సభ్యులకు తెలియ చేయడంతో వారు అక్కడకు చేరుకొని నాగరాజు మృతికి కారణమైన పోలీసులు, మహిళ కుటుంబ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నెల్లూరులో వివాహిత బలవన్మరణం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్‌లో శనివారం ఓ వివాహిత ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు, బాలాజీనగర్ లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపాన కృష్ణ, గోమతి(31) దంపతులు ఉం టున్నారు. వారికి ఇద్దరు కుమారులు. కృష్ణ నగరంలోని ఓ పెట్రోలు బంకులో పని చేస్తుండేవాడు. మనస్పర్థల కారణంగా ఆయన తన స్వగ్రామమైన దగదర్తిలో ఉంటూ అప్పుడ ప్పుడు భార్యాపిల్లల వద్దకు వచ్చి వెళ్లేవాడు. గోమతి ఓ క్యాటరింగ్‌లో పని చేస్తూ పిల్లలను పోషించుకునేది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో శనివారం ఆమె తన ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన చుట్టుపక్క లవారు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు ఆమెను తరలిం చారు. అనంతరం భర్త కృష్ణకు, పుట్టింటి వారికి సమా చారం అందించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. సమా చారం అందుకున్న బాలాజీనగర్ ఎస్ఐ విజయశ్రీనివాస్ వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలన్నదే లక్ష్యం

● పురపాలక శాఖ మంత్రి నారాయణ



శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (హరనాధపురం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలోని స్మార్ట్ స్ట్రీట్ వ్యాపారులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు సాధారణంగా చేసే చిన్నచిన్న వృత్తులు కాకుండా, పెద్దపెద్ద వ్యాపారాలు చేసే స్థాయికి ఎదగాలన్నదే తన అభిమతమన్నారు. వ్యాపారం విజయవంతంగా నిర్వహించాలంటే కంప్యూటర్‌పై కనీస అవగాహన ఉండాలని తెలిపారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా మహిళలకు రూ2500 కోట్లు విలువ చేసే ఇసుక వ్యాపారాన్ని అందించామని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నగరంలోని నిరుపేదలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతానని, వేయిమందితో దుకాణాలు ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. ఇందులో భాగంగా మొదటిదశలో 163 మంది వీధివ్యాపారులను ఎంపిక చేసి, వారితో దేశంలో ఎక్కడా లేనివిధంగా స్మార్ట్ బజార్లను నిర్వహించచేస్తామని వివరించారు. వ్యాపారుల కోసం అవసరమైన సబ్సిడీలు, రుణాలు, సోలార్ పవర్ అందజేయడమే కాకుండా, వారికి వ్యాపారంలో మెలకువలు తెలియజెప్పేందుకు మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ వైవో నందన్, మెప్మా పీడీ రాధమ్మ, మెప్మా అడిషినల్ మిషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, స్టేట్ మిషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సుధీర్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.



సినిమాలో ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న చిత్ర యూనిట్

అల్లూరులో సినిమా సందడి

అల్లూరు మండలంలోని పలు ప్రాంతాల్లో హైదరాబాద్ నుంచి వచ్చిన చిత్ర పరిశ్రమ యూనిట్‌తో సినీ సందడి నెలకొంది. ఈ ప్రాంతంలో మూడు రోజులుగా చేపట్టిన సినిమా షూటింగ్ శనివారం ఇందుపూరులో చిత్రీకరించారు. ఎంఎంఆర్ ఆర్ట్స్ క్రియేషన్ పతాకంపై రూపుదిద్దుకుంటున్న 'ఈమె సుబ్బమ్మ.. ఇదియే ఈమె కథ' సినిమాకు శ్యామ్‌సెల్వన్ కథా నాయకుడుగా, ఇష కథానాయికగా, ఏఎన్‌కె కిరణ్ దర్శకత్వం వహిస్తుండగా మంద మల్లికార్జున రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ సహజత్వానికి అల్లూరు మండలంలోని పలు ప్రాంతాలు సినిమా వాతావరణానికి అనుకూలంగా ఉన్న కారణంగా ఈ ప్రాంతాలల్లో సినిమా రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక నాయకుడు ఎండేటి హరికృష్ణ యాదవ్ సహకారంతో ఈ సినిమా షూటింగ్ ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతోందన్నారు.

- అల్లూరు,(ఆంధ్రజ్యోతి)

ఉగ్రవాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి : బీజేపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతంగా ఉన్న కశ్మీర్‌లో అక్రమంగా చొరబడి మారణ హోమం సృష్టించిన ఉగ్రవాదుల చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. నగరంలోని కోటమిట్ట మహాలక్ష్మి గుడి నుంచి పాత మునుముడి బస్టాండ్‌లోని వివేకానంద విగ్రహం వరకు శనివారం బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద చర్యను దేశంలోని ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్‌కు సింధూ జలాల తరలింపు నిషేధం, పాక్ పౌరుల వీసా రద్దు వంటి నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ అంజలి ఘటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హేమంత్, బాలాజీ, పెంచలయ్య, సత్య, మురళి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మట్టి నమూనాలపై అవగాహన

ఇందుకూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):జగదేవిపేట రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో శనివారం అధికారులు మట్టి నమూనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ పెంచలయ్య, మాదయ్య, నరేష్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏవో రఘునాథ రెడ్డి

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9275
వెండి కిలో ధర	రూ. 99,700
వెండి ఒక గ్రాము	రూ.102.70

న్యూస్ బాక్స్

వైభవంగా వార్షికోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):చెల్లాయపాళెం షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవ పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చెల్లాయపాళెంతో పాటు చట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

పహల్గాం దాడికి నిరసన

కోవూరు, ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడిని నిరసిస్తూ స్థానిక గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం కళాశాల పరిసరప్రాంతంలో ప్రదర్శన చేపట్టారు. జాతీయపతాకాలు పట్టుకుని నినాదాలు చేశారు. ఉగ్రవాదం వద్దు- శాంతి ముద్దు అంటూ నినదించారు. ప్రదర్శనలో కళాశాల డైరక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ సందీప్, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్, అధ్యాపకులు పెంచలరెడ్డి, బాబు, చక్రపాణి, వై మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

విడవలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించినపుడే గిరిజనుల భవిష్యతు ఉంటుందని గిరిజన చైతన్య విద్యావేదిక రాష్ట్ర నాయకులు పులి చెంచయ్య తెలిపారు. ఊటుకూరు శంకర్‌నగర్ కాలనీలో విద్య భ్యసిస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ పిల్లలను పనుల కు పంపవద్దని అవగాహన కల్పించారు.

అటవీ శాఖలో ఇంటి దొంగలు

- అక్రమంగా జామాయిల్ కటింగ్
- ట్రాక్టర్లలో ప్రైవేటు మిల్లులకు విక్రయం
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):స్థానిక రేంజ్ అటవీశాఖ పరిధిలో ఇంటి దొంగలు తయారయ్యారు. గుట్టు చప్పుడు కాకుండా రూ.లక్షల విలువైన జామాయిల్‌ను కటింగ్ చేసి ప్రైవేటు మిల్లులకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. రేంజ్ పరిధిలోని వెంకటాచలం మండలం గొలగముడి క్రాస్‌రోడ్డు వద్ద గల నగరవనంలోనూ, నెల్లూరు రూరల్ మండలం పరిధిలోని దొంతాలి ప్రాంతాల్లోనూ ఏళ్లనాటి జామాయిల్ చెట్లను అక్రమంగా కొట్టేసి విక్రయిస్తున్నారు. ఇదంతా ఎవరో స్మగ్లర్లు చేస్తున్న పనికాదు. విధుల్లో ఉన్న అటవీశాఖ సిబ్బందే చేస్తున్నారు. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేరన్నచందంగా రేంజ్ పరిధిలోని కొందరు అటవీ అధికారులు, సిబ్బంది కలిసి చేస్తున్న అక్రమాల దందా ఇది.


వెంకటాచలం మండలం నగరవనం నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లలో తరలిస్తున్న జామాయిల్ కర్ర

● అనుమానం రాకుండా...

జిల్లావ్యాప్తంగా ఇటీవల జామాయిల్ తోటల విక్ర యం కోసం టెండర్లు పిలిచారు. జిల్లాలోని ఐదు రేంజ్‌ల పరిధిలో 3500 హెక్టార్లలో సుమారు 102000 మెట్రిక్ టన్నుల జామాయిల్‌ను విక్రయించేందుకు గ్లోబల్ టెండర్లు పిలిచారు. ఒరిస్సాకు చెందిన జేకే పేపర్‌మిల్లు వారు టన్ను రూ. 8,100కు టెండరు దక్కించుకొన్నారు. నెల రోజులుగా వారు జామాయిల్ కటింగ్ ప్రారంభించారు. ఇదే సమయంలో అటవీశాఖలోని ఇంటి దొంగలు తమ పనిని ప్రారం భించారు. వివిధప్రాంతాల్లో ఇష్టానుసారంగా జామాయిల్ చెట్లను కటింగ్ చేసి అక్రమంగా విక్రయించడం ప్రారంభించారు. ఎవరైనా అడిగినా జిల్లాలో జామాయిల్ టెండర్ పాడిన వారు కటింగ్ చేస్తున్నారని చెబుతునానరు. ఆంధ్రజ్యోతి నిఘాలో వీరి బాగోతం బట్టబయలైంది. నెల్లూరు రేంజ్‌లో ఇంత జరుగుతున్నా అటవీశాఖ ఉన్నతాధికారులు మాత్రం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

నెల్లూరు రేంజ్ పరిధిలోని వెంకటాలం,దొంతాలి ప్రాంతాల్లో అటవీ సిబ్బంది చేసిన జామాయిల్ అక్రమ కటింగ్‌పై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకొంటాం. ఇలాంటి పని ఎవరూ చేసిన ఉపేక్షించేదిలేదు. టెండర్లు దక్కించుకున్నవారు లారీల్లో మాత్రమే కర్రను రైల్వేయార్డుకు తరలిస్తారు.అయితే ట్రాక్టర్లలో ఎవరు తరలించారన్న దానిపై విచారణ జరిపి చర్యలు తీసుకొంటాం. - మహబూబ్‌బాషా, డీఎఫ్‌వో

సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని పొలాల రైతులు రెండో పంటకు సిద్ధం అవుతున్న తరుణంలో కనిగిరి రిజర్వాయర్ ఆయకట్టు సదరన్ చానల్ కాలువలో ఓఅండ్‌ఎం నిధులతో పూడికతీత పనులను అధికారులు ప్రారంభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెనుబల్లి ఆంజనేయస్వామి విగ్రహం దగ్గర్నుంచి కనిగిరి రిజర్వాయర్ వరకు ఈ పనులు చేపట్టనున్నట్లు నీటిపారుదల నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మూడేళ్లుగా ఈ కాలువలో పనులు చేపట్టక పోవడంతో అడవిని తలపించేలా గుర్రపుడెక్క, తుంగ పేరుకుపోయి ఉంది. పనులు చేపట్టాలని గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు పాలకులను కలసినా ఎలాంటి పనులు చేపట్టలేదు. కూటమి ప్రభు త్వంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో సదరన్‌ఛానల్ పూడికతీతకు నోచుకుంటుండడంతో రెండో పంటకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.


పెనుబల్లి వద్ద పూడికతీత చేపడుతున్న ఎక్సకవేటర్లు

వైభవంగా పెంచలస్వామి కల్యాణం


స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం

రాపూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శనివారం స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణ మండపంలో స్వామి అమ్మ వార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిం చారు. అనంతరం ఉంజల్ సేవ, రాత్రి స్వామివారికి క్షేత్రోత్సవం నిర్వహించినట్లు ఆలయ ఈఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

అగ్ని ప్రమాదంపై జాయింట్ మాక్ డ్రిల్

ముత్తుకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ అగ్నిమాపక సేవా పక్షోత్సవాల సం దర్భంగా ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీ నిర్వాహకులు శనివారం ఉమ్మడి అత్యవసర ప్రతిస్పందన మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. బొగ్గు ఫీడర్లలో ఒక పెద్ద అగ్ని ప్రమాదం జరిగినపుడు ఎలా స్పందించాలో ఈ డ్రిల్ ద్వారా ప్రదర్శించారు. కాల్ అందిన వెంటనే ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్, అదానీ కృష్ణపట్నం పోర్టు, జెన్‌కో ప్లాంట్ నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ టెండర్లను ఉపయోగించి ఉమ్మడి అగ్నిమాపక చర్య చేపట్టారు. చివర్లో ప్రమాద నివారణపై వివరణాత్మక సెషన్ చేపట్టారు. అగ్నిసురక్షిత దేశం కోసం ఏకమవుదాం.. అనే నినాదంతో ఈ ఏడాది కార్యక్రమాలు చేపట్టారు. డ్రిల్‌లో మూడు కంపెనీలకు చెందిన అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.


అగ్నిప్రమాద నివారణపై ఉమ్మడి మాక్ డ్రిల్

వితంతువులకు పెన్షన్ అవకాశం

రాపూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ పొందుతూ మరణించిన వారి భార్యలకు పెన్షన్ పొందే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్లు రాపూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మారెళ్ల భవానీ శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాపూరు మండలంలో పెన్షన్ పొందుతూ మరణించిన 119 మంది స్థానంలో వారి భార్యలకు వితంతు పెన్షన్ మంజూరు చేయుటకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వితంతువులు తమ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఆధార్, డెత్ సర్టిఫికెట్, తదితర ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించవలసినదిగా ఎంపీడీఓ కోరారు. వీరికి మేనెల 1వ తేదీ నుంచి పెన్షన్ అందజేయడం జరుగుతుందన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

సైదాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణారెడ్డిపల్లిలో వైకుంఠపురం మహావిష్ణువు, మహాలక్ష్మీ ఆలయంలో తాతయ్యస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం వసంతోత్సవం, స్నపన తిరుమంజనం, చక్రస్నానం, రాత్రి ధ్వజ అవరోహణం, పుష్పయాగ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు మధ్యాహ్నం అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు బెల్లం భరణిరావు, ప్రసన్నలక్ష్మీ, పోతుగుంట శ్రీధర్ నాయుడు, శ్రీలక్ష్మీ, వల్లూరు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం

పొదలకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి మొదటిసారి పొదలకూరుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం పార్టీ కార్యాలమంలో ఘనంగా సత్కరించారు. పార్టీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మస్తాన్‌బాబు మాట్లాడుతూ పొదలకూరు నిమ్మ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్‌ను కలిసిన వారిలోఓ ఏఎంసీ డైరెక్టర్ పోతుగుంట రామలింగయ్య నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు వెన్నపూ స రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, నాగేళ్ల వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కస్తూరి రంగన్ మృతి దేశానికి తీరనిలోటు

పొదలకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భారత అంత రిక్ష రంగాన్ని కీలక మలుపు తిప్పిన దార్శనికుడు, మాజీ ఇస్రో చైర్మన్, పద్మవిభూషణ్ కస్తూరిరంగన్ అకాల మృతి దేశానికి తీరనిలోటని పొదలకూరు జడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్ అన్నారు. ఈ విషయంపై శనివారం ఆయన మాట్లాడుతూ దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోవడం అత్యంత బాధాకరం అని వాపోయారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి స్ఫూర్తితో భవిష్యత్ తరాల్లో మరింత మంది మేధావులు దేశాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాపూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు, పట్టణంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రాపూరు ఫీడర్, తెగచెర్ల ఫీడర్, వేపినాపి ఫీడర్, సిద్ధవరం ఫీడర్, కొమ్మిపాడు ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌కు సంబంధించి ఎమర్జెన్సీ మెయింటెన్స్ వర్క్‌లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని ఏఈ తెలిపారు.

చవిటి కాలువలు ఏర్పాటు చేయాలి

కోవూరు, ఏప్రిల్26, (ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మీనగర్ రెండవవీధిలో చవిటి కాలువ లేకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. గత 30ఏళ్లుగా ఈ కాలనీలో చవిటి కాలువల్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

డిగ్రీ పరీక్షకు 16 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీలోని అనుబంధ కళాశాలలో శనివారం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షకు 16మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి మధుమతి ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 114మందిలో 98మంది హాజరైయ్యారు.

అగ్ని ప్రమాదానికి గురైన మినీ లారీ

● చిట్వేల్ ఘాట్ రోడ్డులో ఘటన



రాపూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాపూరు చిట్వేల్ ఘాట్ రోడ్డులో మినీ లారీ దగ్ధం అయిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రాజంపేట నుంచి గూడూరుకి జీవాల వ్యాపారం కోసం వస్తుండగా 12వ కిలోమీటర్ వద్ద ఒక్కసారిగా లారీలో మంటలు చెలరేగడంతో డ్రైవర్ లారీలో నుంచి లోయ లోకి దూకేశాడు. దీంతో స్వల్ప గాయాలతో బయటపడ్డ డ్రైవర్ అటుగా వస్తున్న వాహనదారులకి తెలుపగా వారు రాపూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మినీలారీ లోని సుమారు మూడు లక్షల యాభై వేల నగదు దగ్ధం అయినట్లు తెలిపారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కరెంటు కోత.. ఉక్కపోతతో అవస్థలు

రాపూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలు, ఉక్కపోతతో మండలంలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారు. మెయింటెనెన్స్ డే అన్న పేరుతో నెలలో ఒక రోజు ఐదు నుంచి ఆరు గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తూనే మరోవైపు ప్రతిరోజూ రాత్రి, పగలు తేడా లేకుండా విద్యుత్ సరఫరా నిలిపేస్తుండడంతో ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి దాపురించింది. మండుతున్న ఎండలకు తోడు విద్యుత్ కోతలతో చిన్నారులు, వృద్ధులు అల్లాడుతున్నారని, ఇకనైనా అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తును అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి సమీపంలోని కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు మండలం చెన్నూరుకు చెందిన కామాక్షయ్య, సుబ్రహ్మణ్యంలు మోటర్ బైక్‌పై ముత్తుకూరు మండలం మిట్టపాళెనికి వెళ్లి వస్తుండగా సర్వేపల్లి రైల్వే గేటు వద్ద ఇడిమేపల్లి వైపుగా వెళ్లే ఆటో ఒక్కసారిగా వంతెన నుంచి బయటకు రావడంతో బైక్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది.క్షతగాత్రులను ఆటోలో సర్వే పల్లిలోని క్లినిక్ తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పూడిపర్తిలో విద్యార్థులకు సత్కారం

వెంకటాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు పది ఫలితాల్లో 500కుపైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం ఉపాధ్యా సిబ్బంది వారిని అభినందించి సత్కరించారు. హెచ్‌ఎం దివాకర్ వారికి జ్ఞాపికలను అందజేసి మాట్లాడారు. ఎస్.మదన్ కుమార్ (563) శివసాయి (545), జానీత (541) సాధించారని చెప్పారు. విద్యార్థులందరూ ఉన్నత చదువులు అభ్యసించి పాఠశాలకు గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

- రూ. 7 లక్షల విలువచేసే సొత్తు స్వాధీనం
- నిందితులకు రిమాండ్


స్వాధీనపు సొత్తును ప్రదర్శిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

ఆత్మకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బంగారు దుకాణం యజమాని నుంచి నగల బ్యాగు దొంగిలించిన కేసులో ఇద్దరు నిందితులను ఆత్మకూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.7లక్షల విలువైన చోరీ సొత్తును రికవరీ చేశారు. ఈ మేరకు కార్యాలయంలో ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ నిందితులను విలేకర్ల సమావేశంలో హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. మార్చి 31న పట్టణంలోని బజార్‌లో చేజర్ల రమణమూర్తి అనే బంగారం వ్యాపారి రాత్రి 9 గంటల సమయంలో దుకాణం మూసేందుకు నగల బ్యాగును కింద పెట్టి షట్టర్ వేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి నగల బ్యాగును అపహరించి పరారయ్యారు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు డీఎస్పీ వేణుగోపాల్ నేతృత్వంలో సీఐ గంగాధర్ ఏర్పాటు చేసిన స్పెషల్ టీమ్ శనివారం బోయిళ్ల చిరువెళ్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న గుడివాడకు చెందిన మంగయ్య, పల్నాడు జిల్లాకు చెందిన ఓటేరి సాయి అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఆత్మకూరులో నగల బ్యాగు దొంగతనం విషయం వెలుగు చూసింది. దీంతో నిందితుల నుంచి సుమారు రూ.7లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హా జరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈకేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అనతి కాలంలోనే నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రికవరీ చేసిన సీఐ గంగాధర్, ఎస్ఐలు జిలాని, సాయిప్రసాద్‌తోపాటు స్పెషల్ టీమ్ పోలీసులను డీఎస్పీ వేణుగోపాల్ అభినందించారు.

ఆస్తి అమ్మేసి, ఇంటినుంచి గెంటివేత

- వడ్లపూడిలో ఘటన
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు


బాధితురాలు రావూరి రమణమ్మ

మనుబోలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వడ్లపూడిలో 60ఏళ్ల పైబడిన వృద్ధురాలు రమణమ్మను ఆమె మరిది రావూరి చంద్రయ్య కుటుంబసభ్యులు ఇంటినుంచి గెంటేశారు. ఇంటికి తాళం వేసి గ్రామం నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆ వృద్ధురాలు చేసేదిలేక నాలుగురోజులుగా అన్నపానాలు లేక విరిగిన కాలుతో రోదిస్తూ ఇంటి ముందు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న రమణమ్మ తమ్ముడు రామకృష్ణ శనివారం గ్రామానికి చేరుకుని అక్కతో కలిసి పోలీసుస్టేషన్‌కు వెళ్లి జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. రావూరి రాఘవయ్య, రమణమ్మలు భార్యాభర్తలు. వీరికి పిల్లలు లేరు. రెండున్నర ఎకరా పొలం ఉంది. ఇందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. అనారోగ్యంతో రామణమ్మ భర్త ఈ నెల రాఘవయ్య 6వ తేదీన మరణించాడు. దీన్ని అలుసుగా తీసుకుని రాఘవయ్య తమ్ముడు చంద్రయ్య రమణమ్మకు తెలియకుండా రాఘవయ్య పొలం అమ్మేశాడు. ఆ డబ్బుతో భార్య, పిల్లలతో నెల్లూరుకు వెళ్లాడు.

మాతమ్మ ఆలయంలో హుండీ చోరీ


దొంగలు పగలగొట్టిన హుండీ

కలువాయి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పర్లకొండ గ్రామంలోని మాతమ్మ ఆలయంలోని హుండీని శుక్రవారం రాత్రి దొంగలు అపహరించారు. ఆలయం తలుపులు తెరిచి హుం డీ తాళం పగలగొట్టి అందులో ఉన్న రూ.10వేల నగదు అపహ రించారు. హుండీని ఆలయ సమీపంలో పడేసి వెళ్లిపోయారు. శ నివారం ఉదయం చోరీ జరిగిన విషయం గుర్తించిన పూజారి పూలే చిన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు న మోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రమణయ్య తెలిపారు.

జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):అక్రమ రవాణా, అసాంఘిక కా ర్య కలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లావ్యాప్తంగా లాడ్జీలు, ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసులు ఆకస్మిక తని ఖీలు నిర్వహిస్తున్నారు. బాంబు స్క్వాడ్ సిబ్బంది బస్టాండ్లు, రై ల్వేస్టేషన్లలో శనివారం అణువణువుగా తనిఖీ చేశారు. ఈ సం దర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. లాడ్జీల యాజమానులు అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందిం చాలని, లాడ్జీ పరిసర ప్రాంతాలు స్పష్టంగా కన్పించేలా తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల న్నారు. చట్టవిరుద్ధ, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ మ ద్యపానం గురించి సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

● **నెల్లూరురూరల్ :** ముత్తుకూరు రహదారికి అనుకుని ఉన్న పలు లాడ్జీల్లో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ గుంజి వేణు మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టామని తెలిపారు. అలాంటి వ్యక్తులు తటస్ పడితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. నేరని యంత్రణలో భాగంగా ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. లాడ్జీల్లో తరుచూ ఆకస్మిక తనిఖీలు జరుగుతూనే ఉం టాయని ఆయన స్పష్టం చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

● ఉత్తుత్తి కాల్ లెటర్లు ● రూ.6.45లక్షల స్వాహా

సంగం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ముగ్గురు యువకులను మోసంచేసిన సంఘటన దువ్వూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలాఉన్నాయి. దువ్వూరుకు చెందిన భరత్, హరీష్, అఖిల్‌లు బీటెక్ చేసి ఉద్యోగ వేటలో ఉన్నారు. ఏడాది కిందట కలిగిరి శ్రీనివాసులు, కందుకూరు శ్రీకాంత్‌లు పరిచయమయ్యారు. ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి గత ఏడాది జూలైలో ముగ్గురు యువకుల నుంచి రూ.6.45లక్షలు వసూలు చేశారు. కొద్దిరోజుల వరకు అదిగో కాల్‌లెటర్.. ఇదిగో కాల్‌లెటర్ అంటూ కాలాయాపన చేశారు. తీవ్రంగా వత్తిడి చేయడంతో కాల్‌లెటర్లు పంపించారు. దీంతో సదరు కంపెనీలకు వెళ్లి విచారించగా అవి ఉత్తుత్తి కాల్ లెటర్లని తెలిసింది. దీంతో తాము చెల్లించిన నగదు తిరిగి ఇచ్చేయాలని బాధితులు డిమాండ్ చేయడంతో వారు ముఖం చాటేశారు. తాము మోసపోయామని తెలుసుకుని బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
కోడిగుడ్ల ధర (100): 425	

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్ కళాశాలల్లో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేలా అధ్యా పకులు విద్యార్థులను సిద్ధం చేయాలని తిరుపతి ఐఐటీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రవిశంకర్ అన్నారు. నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రీసెర్చ్ పేపర్స్ టూ పేటెంట్స్ టూ ప్రాజెక్ట్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ.దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శ్రీనివాసులరెడ్డి, మెకానికల్ హెచ్‌వోడీ డాక్టర్ ఏవీఎస్.శ్రీధర్, ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ కే.మురళి పాల్గొన్నారు.

● కాగా అదే కళాశాలలో ఈడీసెల్ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రైనర్‌షిప్‌పై అవగాహన నిర్వహించారు. కార్యక్రమానికి శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శ్రీనివాసులరెడ్డి, ఈడీసెల్ కన్వీనర్ డాక్టర్ కే.సాయికుమార్, ఎంబీఏ డీన్ డాక్టర్ జీ.ధనుం జయ్, ఎంబీఏ హెడ్ డాక్టర్ జీ.మాల్యాద్రి, ఎంసీఏ హెడ్ డాక్టర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో రాజీపడను !

● తప్పు చేస్తే బదిలీ వేటు తప్పదు
● వెయ్యి మంది మహిళలను వ్యాపారులుగా చేయడమే లక్ష్యం
● సమీక్ష, ఆకస్మిక తనిఖీల్లో మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి విషయంలో తాను ఎవరితోనూ రాజీపడే ప్రసక్తేలేదని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంతో పాటు, ఎన్ఎంసీ కార్యాలయంలోని వివిధ విభాగాలతో సమీక్షలు నిర్వహించారు. ముందుగా నగర నియోజకవర్గంపై అధికారులు, కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో ముందుగా మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అశ్రద్ధ వహించవద్దని స్పష్టం చేశారు. ఎవరైనా తప్పులు చేస్తే బదిలీ వేటు తప్పదని పేర్కొన్నారు. సుపరిపాలనకు రాష్ట్రంలోనే నెల్లూరు రోల్‌మోడల్‌గా నిలవాలని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వీఆర్ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎన్ఎంసీ కార్యాలయంలో మాట్లాడుతూ నగరంలో వేయిమంది మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దాలని తాను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 167 మందిని పొదుపు గ్రూపుల ద్వారా ఎంపిక చేసి స్మార్ట్ స్ట్రీట్‌లో భాగంగా స్టాల్స్ కేటాయిస్తున్నామన్నారు. మహిళల కోసం రచించిన 108 స్టార్టప్ పుస్తకాన్ని వారికి అందించారు. కోవూరు షుగర్స్ ఫ్యాక్టరీ స్థానంలో ఎంఎస్ఎంఈలను తీసుకువచ్చి 40 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నారాయణ వెల్లడించారు.

● పార్కుల ప్రారంభం

నగరంలోని 9వ డివిజన్ పరిధిలో బీఆర్ అంబేడ్కర్ పేరిట ఏర్పాటు చేసిన పార్కును మంత్రి ప్రారంభించారు. ఓపెన్ జిమ్, ప్లే ఎక్విప్‌మెంట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. అక్కడున్న చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం సంతపేట మార్కెట్‌కు వెళ్లిన ఆయన చిరువ్యాపారులతో మాట్లాడారు. వీఆర్ హైస్కూల్ వద్ద జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. అనంతరం 5వ డివిజన్‌లో ఎస్వీఆర్ పార్కు, 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీలో ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి ప్లాంటును ప్రారంభించారు. కార్యక్రమాలలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎన్ఎంసీ కమిషనర్ వైవో నందన్, నాయకులు తాళ్లపాక అనురాధ, విజేత తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభించి అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

స్వీపింగ్ యంత్రం వచ్చేసిందోచ్ !

ఈ చిత్రంలో కనిపించేది రోడ్లు శుభ్రం చేసే స్వీపింగ్ యంత్రం. దీన్ని కార్పొరేషన్ అధికారులు కొనుగోలు చేశారు. ఇటీవలే మంత్రి నారాయణ దీన్ని ప్రారంభించారు. రోడ్లపై దుమ్ము, ధూళి, మట్టిని ఇది శుభ్రంగా చిమ్మేస్తుంది. రోడ్లను అందంగా తయారుచేస్తుంది. ఇలాంటివి మరిన్ని కొనుగోలు చేసేందుకు కార్పొరేషన్ సిద్ధమైంది. కార్మికులకు ప్రత్యామ్నాయంగా పారిశుధ్య పనుల్లో జాప్యం లేకుండా యంత్రాలను రంగంలోకి దింపుతున్నారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న స్వీపింగ్ యంత్రం

జాబ్‌మేళాలో 78 మంది ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాల కోసం 202 మంది హాజరుకాగా, 78 మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి అభినందించారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డి నేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు, చిరువ్యాపారులు ఐక్యంగా ఉండాలి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, చిరువ్యాపారులు అందరూ కూడా ఐక్యంగా ఉండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని కూరగాయల మార్కెట్ సమీపాన ఉన్న కోనేరు ప్రాంతం వ్యాపారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ వందలాదిమంది ఆకుకూరలు, కూరగాయలు అమ్ముకునే చిరువ్యాపారులకు సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కోనేరు మార్కెట్ చిరువ్యా పారుల అసోసియేషన్ అధ్యక్షుడిగా మోహన్, కార్యదర్శిగా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండాప్రసాద్, పెంచలనర్సయ్య, ఇతర నేతలు సతీష్, పులిమి నరసింహారెడ్డి, గిరిబాబు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

15న 303 అభివృద్ధి పనుల ప్రారంభం : కోటంరెడ్డి

నెల్లూరురూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్ నియోజకవర్గంలో మే 15న 303 అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరులోని తన కార్యాలయంలో 26 మున్సిపల్ డివిజన్ల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రూ. 40 కోట్లతో 303 అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. వీటితోపాటు మరో 20 పనులు కూడా అదనంగా చేస్తున్నామని చెప్పారు. మే 15న 606 మంది పార్టీ కార్యకర్తలతో ఈ పనులను ప్రారంభిస్తామన్నారు. ఒకే రోజు ఈ పనులన్నింటికి శంకుస్థాపనలు చేసి రికార్డు సృష్టించామని, అదే రికార్డును అనుకున్న సమయానికంటే ముందుగానే పనులు ప్రారంభించి తిరగరాయనున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు భానుశ్రీ, రాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

టెన్త్ ఫలితాల్లో సిటీ స్కూల్ ప్రతిభ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ ఫలితాల్లో సిటి స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలి తాలు సాధించారని కరస్పాండెంట్ మల్లికార్జున తెలిపారు. పాఠశాలలో శనివారం జరిగిన అభినం దన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన దేవ మురుగన్ 593, అసజాద్ అహ్మద్ 589, లేఖశ్రీ 584, దర్శిల్ 583 మార్కులు సాధించారన్నారు. సమష్టికృషితోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న 'సిటీ' యాజమాన్యం

విద్యార్థినులకు ఉపాధి కల్పనే ధ్యేయం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి అన్నారు. నగరంలోని కళాశాలలో శనివారం ఫ్యాషన్ టైలరింగ్, ఆక్వా ఉత్పత్తుల తయారీ శిక్షణ ముగింపులో ఆయన మాట్లాడారు. జిల్లాకు చెందిన 15 మంది టైలరింగ్‌లో, 22 మంది ఆక్వాకల్చర్‌లో శిక్షణ పొంది, ఉపాధి పొందేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్‌లను అందచేశారు. తదుపరి కళాశాల ఆవరణలో కడప జోన్‌కు చెందిన కోరమాండల్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కోరమాండల్ జోనల్ మార్కెటింగ్ హెడ్ డాక్టర్ చక్రధర్, హెచ్ఆర్ సౌజన్య, లెర్నింగ్ ఫౌండేషన్ ప్రతినిధి కిషోర్, కోఆర్డినేటర్ డాక్టర్ టీ.శ్రీరంజని, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న ప్రిన్సిపాల్

ఉగ్రదాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రదాడులకు నిరసనగా శనివారం రాత్రి ఆర్య వైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ వ్యాపారులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఏవీ.ఫణీంద్రకుమార్, కోశాధికారి వీ.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

● ఉగ్రవాదులను ఏరివేయాలి

పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయినవారి ఆత్మశాంతి కోసం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం జర్నలిస్టులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ నుంచి గాంధీబొమ్మ వరకు శాంతి ర్యాలీ నిర్వహించి , ఉగ్రవాదులను ఏరివేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా కోశాధికారి గడ్డం హనోక్, సామ్నా నాయకులు పురుషోత్తంబాబు, వేలూరు సుబ్బారావు, చక్రం దినేష్ కుమార్, సునీల్ గవాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

● లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

ఉగ్రవాదులకు మద్దతు తెలుపుతున్న వారిని కఠినంగా శిక్షించాలని శనివారం గాంధీబొమ్మ వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్రతిభ, లయన్స్ క్లబ్ నెల్లూరు సభ్యులు నిరసన తెలిపారు. ప్రాణాలు కోల్పోయినవారి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులతో సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ గౌతమ్, పేర్ల జనార్దన్, కిషోర్ కుమార్, పార్థసారధి, పేర్ల రాము, రాజా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

● ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీ

నెల్లూరు (హరనాథపురం) (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ మాజీ సైనిక అసోసియేషన్, సైనిక సంక్షేమం కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సైనిక సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణ, అసోసియేషన్ నాయకులు కళాధర్, బీజే.రెడ్డి, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

● మృతులకు సంతాపం

నెల్లూరు (విద్య) : కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాట కులకు శనివారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. అనంతరం స్టేడియంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వేలూరు రంగారు, అసోసియేషన్ కార్యదర్శి సురేష్, నేతలు అరిగల సాయిరాం, తిరుపతి నాయుడు, శేషగిరిరావు, బలరామయ్యనా యుడుతో పాటు పలువురు వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సైనిక సంక్షేమ శాఖ అధికారులు



ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన ఆర్యవైశ్య బిలియన్ మర్చంట్స్ అసోసియేషన్ వ్యాపారులు

పేకాట స్థావరంపై దాడి

కావలి రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని బాల కృష్ణారెడ్డి నగర్ శివారులో పేకాట స్థావరంపై శనివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసులకుని వారి నుంచి రూ.1650 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రైల్వే కాంట్రాక్టర్ల కుమ్ములాట

సబ్ కాంట్రాక్టర్‌కు బిల్లుల బకాయిలు ● ఏడాదిగా నిలిచిపోయిన ఎలక్ట్రికల్, కోర్టు భవనం, ఎస్టీపీ పనులు ● గడువు పూరైనా.. ఇంకా ప్రారంభంకాని పనులు ● నోరు మెదపని రైల్వే అధికారులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లలో బిల్లుల చెల్లింపు విభేదాల కారణంగా, వారి మధ్య కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. దీంతో వివిధ విభాగాల పనులు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం పునరాభివృద్ధి పథకం ద్వారా 2019లో దాదాపు రూ.102 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కరోనా అనంతరం 2022, ఆగస్టులో ప్రాజెక్ట్ పనులను హైదరాబాద్‌కు చెందిన ఎస్‌జీ ఆర్‌ఎల్, ఫేస్ సంస్థలకు అప్పగించారు. తూర్పు, పడమర వైపు నిర్మించాల్సిన ప్రధాన రైల్వే భవనాల నిర్మాణం మాత్రమే వీరు చేస్తూ మిగతా దాదాపు 11 ప్రధాన పనులైన ఎలక్ట్రికల్, ఫైర్ ఫైటింగ్, ఏసీలు, వెంటిలేషన్, సిగ్నలింగ్ వ్యవస్థ, లైటింగ్, కోర్టుభ వనం, ఎస్టీపీ ప్లాంట్, సోలార్, బీఎంఎస్ పనులను సబ్ కాంట్రాక్టర్‌లకు లీజుకు అప్పగించారు.

అయితే ఈ పనులు సబ్‌కాంట్రాక్టర్ తీసుకొని చేసిన పనులకు ఏడాది కాలంగా ప్రధాన కాంట్రాక్టర్ బిల్లులు నిలిపివేశారు. దీంతో నూతనంగా నిర్మాణం జరుగుతున్న రైల్వేస్టేషన్ భవనంలో ఎలక్ట్రికల్ పనులతోపాటు కోర్టు భవనం,ఎస్టీపీ ప్లాంట్ ఇలా.. దాదాపు 11 విభాగా పనులను నిలిపివేశారు. రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో చివరికి పనులు నిలిపివేశారు. ప్రధాన కాంట్రాక్టర్ బిల్లులను చెల్లింపు చేసిన తరువాత పనులు ప్రారంభిస్తామని సబ్‌కాంట్రాక్టర్ తేల్చిచెప్పారు. ఈ పరిణామాలతో 2024 మే నెల కల్లా పూర్తికావల్సిన పునరాభివృద్ధి పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. కొన్ని పనులు ఇంతవరకు ప్రారంభమే కాలేదు.

● నోరు మెదపని అధికారులు

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పథకంలో భాగంగా జరగాల్సిన పనులు దాదాపు ఏడాది కాలంగా నిలిచిపోయి ఉన్నా రైల్వే ఇంజనీర్లు మాత్రం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఇచ్చిన గడువు పూర్తయి, సంవత్సరం అవుతున్నా కాంట్రాక్టర్ల మధ్య బిల్లుల కుమ్ములాటతో అనేక పనులు నిలిచిపోయి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్లతో రైల్వే అధికారులు మాట్లాడి, నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించాల్సి అవసరం ఎంతైనా ఉంది.



అర్ధంతరంగా ఆగిన ఎస్టీపీ ప్లాంట్ పనులు

న్యూస్ బాక్స్

అసమానతలు తొలగించాలి



మాట్లాడుతున్న పందిటి సుబ్బయ్య

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం రూపొందించిన రోస్టర్ పాయింట్లలో మాది గలకు అన్యాయం జరుగుతుందని, అందులోని అసమానతలు తొలగిం చాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ డిమాండ్ చేశారు. డాక్టర్ జగ్జీవన్ భవన్‌లో శనివారం మాదిగల జేఏసీ నేతల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పలువురు నేతలు, ఉద్యోగులు పాల్గొని ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం సుబ్బయ్య మాట్లాడుతూ వర్గీకరణ రోస్టర్ పాయింట్లలో మాదిగలకు ఆరుశాతం, మాల లకు 8శాతం కేటాయించడం సరికాదన్నారు. లోపాలతో కూడిన ఆర్డినెన్స్‌ను సరిచేసి మాదిగ లకు ఏడు శాతం, రెల్లి ఉపకులాలకు ఒకశాతం రోస్టర్ పాయింట్లు ఉండేలా చట్టం చేయాలన్నా రు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు డేగ రవి, రాఘవేంద్ర, విజయ్‌కుమార్, పల్లాల శ్రీనివాసులు, కొమ్మల కృష్ణయ్య, జనార్దన్, గడ్డం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కళాకారులను ప్రోత్సహించండి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను, హస్త కళల వస్తువులను, హస్త కళాకారులను ప్రోత్సహించాలని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి కస్తూరిదేవి విద్యాలయం ఎదురుగా రాయల్ రూరల్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళల ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించి చేనేత హస్తకళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ధనుంజయరాజ్ మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ 45 రోజులపాటు ఉంటుందన్నారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 9గంటల వరకు తెరిచి ఉంటుందని పేర్కొన్నారు.

శిక్షణ కేంద్రం పరిశీలన

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సీడాప్ ద్వారా నిర్వహిస్తున్న నగరంలోని స్కిల్ కళాశాల ఎస్ఆర్ టీపీ, శిక్షణ కేంద్రాన్ని పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శనివారం పరిశీలించారు. ఆ కాలేజీలో ఇస్తున్న శిక్షణను, ఉన్న వసతులను పరిశీలించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ 10వతరగతి పాసై ఉండి, 18 నుంచి 30 ఏళ్ల వయసులోపు కలిగిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తదుపరి యువతకు ఉచితంగా యూనిఫాం, శిక్షణ మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో జేసీ కే. కార్తీక్, నగర కమిషనర్ వై.వో.నందన్, డీఆర్‌డీఏ పీడీ వీ.నాగరాజకుమారి, జిల్లా జాబ్స్ మేనేజర్ పీ.హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం నవగ్రహ మండపంలోని శనీశ్వరుడి భక్తులు తైలాభిషేకం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు, సహాయ కమిషనర్ కే. జనార్దన్‌రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.


కొనసాగుతున్న అవతార ఉత్సవాలు



భగవద్రామానుజులకు నిర్వహించిన మంగళశాసనోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాథ స్వామి ఆలయంలో భగవద్రామానుజుల 1008వ అవతార ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం తిరుమంజనం సేవ, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం పూలంగి సేవ ,విశేష పూజలు జరిగాయి. అనంతరం మంగళశాసనోత్సవం, పేట ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవాన్ని ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.

■ SUNDAY SPECIAL



"జీవితంలో ఇక సాధ్యం కాకపోవచ్చనే కోరిక, సాకారమైందనే సంతోషం కలుగుతూ ఉంది. ఫిలాసఫీలో పీజీ వల్ల చాలా సంతృప్తిని పొందాను. పీజీ కోర్సులో కొన్ని పుస్తకాలు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. జిడ్డు కృష్ణమూర్తి రాసిన 'నీవే ప్రపంచం', ఎస్.రాధాకృష్ణన్ 'ఇండియన్ ఫిలాసఫీ', టీఎంపీ మహదేవన్ రాసిన 'అద్వైత తత్త్వం', ఫ్రాంక్ థిల్లీ రాసిన 'పాశ్చాత్య తత్త్వశాస్త్ర చరిత్ర', ఓషో 'ధ్యానం', 'ప్రేమ' వంటి గ్రంథాలు చదివాను. జిడ్డు కృష్ణమూర్తి తత్త్వాన్ని చదివినప్పుడు చాలా సంఘర్షణకు లోనయ్యాను. 'దేవుడు అనే నమ్మకంతో సత్యాన్ని తెలుసుకోలేరు' అనడం.. గురుత్వాన్ని తిరస్కరించడం నన్ను బాగా ఆలోచింపజేశాయి."

ఏడు పదుల విద్యార్థి

ఎస్వీయూలో ఎంఏ ఫిలాసఫీ చదువుతున్న రాజేంద్రబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

'అప్పట్లో ఫలానా డిగ్రీ చేయాలనుకున్నాను.. పరిస్థితుల వల్ల ఆపేయాల్సి వచ్చింది.' అని విచార జ్ఞాపకాలను మనుమలతో పంచుకుంటూ ఉంటారు చాలా మంది. 'నా కోరిక తీరనే లేదు.. మీరైనా చదువుకోండి' అని సలహా కూడా ఇస్తుంటారు. ఈయన మాత్రం ఆ బాపతు కాదు. రిటైరయ్యాక కృష్ణా..రామా అనుకుంటూ గడిపేయాలని అనుకోలేదు. నలభై ఏళ్ల కిందట నిలిచిపోయిన పీజీ చదువును ఏడు పదుల వయసులో కొనసాగిస్తున్నారు. అదీ ప్రయివేటుగా కాదు రెగ్యులర్ విద్యార్థిగా.

ఎస్వీ యూనివర్శిటీ ప్రాంగణంలో సైకిలు మీద దూసుకుపోతూ కనిపించే ఈయనను.. 'వ్యాయామం కోసం సైకిల్ తొక్కుతున్న పెద్దాయన' అనుకుంటారు చాలామంది.

లైబ్రరీలో పుస్తకాలు వెతుక్కుంటూ కనిపిస్తే.. 'ఎవరో పఠనాసక్తి మెండుగా గల మనిషి' అనీ అనుకుంటారు.

యూనివర్శిటీ టీచర్ల గదుల్లో కనిపిస్తుంటే.. 'వారి బంధుమిత్రులెవరో' అనుకుంటారు.

నిజానికి ఈయన ఎస్వీ యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో పీజీ విద్యార్థి. పేరు రాజేంద్రబాబు. వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా రిటైరయ్యాక పీజీలో చేరారు. కార్వేటినగరం మండలం కుమ్మరగుంటకు చెందిన రాజేంద్రబాబు ఎన్ఆర్ కండ్రిగలో ప్రాథమిక విద్య చదివారు. కత్తెరపల్లె, కార్వేటినగరంలలో హైస్కూలు చదువు సాగింది. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. 1977లో ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ ఫిలాసఫీలో చేరారు కానీ చదువు సాగలేదు. ఇంటి దగ్గర వ్యవసాయ పనుల భారం పడింది. చదువు మధ్యలో వదిలేసి ఇంటి బాట పట్టారు. సేద్యం చేసుకుంటూనే పోటీ పరీక్షలు రాయడం మొదలు పెట్టారు. 1980లో రైల్వే సర్వీసు పరీక్షల్లో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ నెగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా మారారు. వాణిజ్య పన్నుల శాఖలో చేరారు. ఉద్యోగం చేస్తూనే 1986లో దూరవిద్య ద్వారా బీఈడీ చేశారు. ఆగిపోయిన పీజీ చదువు పూర్తి చేయాలనే కోరిక ఉండిపోయింది. ప్రయివేటుగా చేసే అవకాశం ఉన్నా యూనివర్సిటీ కేంపస్‌లో చదవడం అనే ఫీలింగ్ రాదు. అది కలగానే ఉండిపోయింది. 2016లో అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రబాబు.. తన కలకు రెక్కలు తొడిగారు. రామచంద్ర మిషన్ నిర్వహిస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలో చేరి తత్త్వశాస్త్ర గ్రంథాలను చదవడం మొదలు పెట్టారు. ఆ పుస్తకాలు చదువుతూ ఉంటే తాను వదిలిపెట్టిన ఎంఏ ఫిలాసఫీ కోర్సు పూర్తి చేయాలనిపించింది. పీజీలో రెగ్యులర్ విద్యార్థిగా చేరిపోయారు. క్రమశిక్షణగా తరగతులకు హాజరవుతారు. సందేహాలుంటే టీచర్లను అడుగుతారు. లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు రెఫర్ చేస్తారు. రాజేంద్రబాబు తల్లి కృష్ణమ్మకి వందేళ్లు. పల్లెలోనే ఉంటుంది. భార్య సుమతి పోర్చుగల్‌లో ఛార్టెడ్ అకౌంటెంట్‌గా పని చేశారు. కుమార్తె చాందినికి వివాహం అయ్యింది. ఇంటి నుంచి ఐదు కిలోమీటర్ల దూరం.. రోజూ సైకిలు మీదనే యూనివర్సిటీకి హాజరవుతారు. విశ్రాంత జీవితాన్ని అర్థవంతంగా మలచుకున్న రాజేంద్రబాబు వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని నిరూపిస్తున్నారు. పీజీ పూర్తయ్యాక ధ్యానంపై విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ చేయాలన్నది ఈయన లక్ష్యం. అదీ సాధించగలననే ఆత్మవిశ్వాసంతో ఉన్నారు రాజేంద్రబాబు.

మా మంచి విద్యార్థి



క్రమం తప్పకుండా యూనివర్సిటీకి వస్తారు. అందరు విద్యార్థులతో కలిసిపోతారు. శ్రద్ధగా కొత్త కొత్త పుస్తకాలను చదువుతారు. సందేహాలను నివృత్తి చేసుకుంటూ ఉంటారు. ఫిలాసఫీపై రాజేంద్రబాబు పట్టు సాధించారు. ఆయనకున్న ఆసక్తి చూస్తే ఆశ్చర్యం, ఆనందం కలుగుతాయి.

- డాక్టర్ నాగలూరి దయాకర్, అధ్యాపకుడు, ఫిలాసఫీ విభాగం, ఎస్వీయూ





గతంలో నిర్మాణంలో ఉన్న ఒబెరాయ్ హోటల్ (ఫైల్ ఫోటో)

అరవింద్ పక్కన ఒబెరాయ్‌కి భూములు

- హయత్‌కు శిల్పారామంలో
- ప్రభుత్వం నిర్ణయం

తిరుపతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హిందూ సంస్థల వ్యతిరేకతతో అలిపిరి సమీపంలో భూములు రద్దు చేసిన ఒబెరాయ్ సంస్థకు ప్రత్యామ్నాయంగా అరవింద్ కంటి ఆసుపత్రి పక్కన 35 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే హయత్ హోటల్‌కు శిల్పారామంలో మూడు ఎకరాలు కేటాయించేందుకు నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. ఒబెరాయ్ తమకు కేటాయించిన భూమిలో ఇప్పటికే నిర్మాణాలు కూడా దాదాపుగా చేసినా, వాటిని టీటీడీకి ప్రభుత్వం అప్పగించనుంది. తిరుపతిలోని అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో వైసీపీ ప్రభుత్వం ఒబెరాయ్ సంస్థకు హోటల్ నిర్మాణానికి భూమి కేటాయించింది. ఆ సంస్థ తాజ్ గ్రూప్ పేరిట నిర్మాణం మొదలు పెట్టడంతో హిందూ సంస్థలు అభ్యంతరం తెలిపాయి. బీజేపీ సహా పలు హిందూ మత సంస్థలు, స్వామీజీలు అలిపిరి కొండ సమీపంలో హోటల్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. దీంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఇటీవల తిరుమలకు వచ్చిన సందర్భంగా సీఎం చంద్రబాబు ఒబెరాయ్‌తో పాటు ఇతర హోటళ్లకు గత ప్రభుత్వం జరిపిన భూ కేటాయింపులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వాస్తవానికి పేరూరు గ్రామ పరిధిలోని ఆ భూములన్నీ రెవెన్యూకు చెందినవైనప్పటికీ తిరుమల పాదాల చెంత అలిపిరి టోల్‌గేట్‌కు చేరువలో ఉన్నందున వాటిని టీటీడీకి అప్పగించనున్నట్టు తెలిపారు. అయితే అప్పటికే ఒబెరాయ్ సంస్థ సుమారు రూ.35 కోట్ల విలువైన నిర్మాణాలు చేపట్టింది. వైష్ణవి సంస్థ కూడా కొంత మేరకు నిర్మాణాలు జరిపింది. హయత్ హోటల్‌కు భూమి కేటాయించినా చదును చేశారు తప్ప పనులేవీ మొదలు కాలేదు. ఆ దశలో భూముల కేటాయింపు రద్దు చేసిన ప్రభుత్వం వాటికి ప్రత్యామ్నాయ కేటాయింపులు జరిపేందుకు శ్రీకారం చుట్టింది. ప్రత్యామ్నాయంపై త్వరగా నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రంలో పెట్టుబడులకు అవరోధం ఏర్పడుతుందని భావిస్తున్నారు. అందులో భాగంగా ఒబెరాయ్ హోటల్‌కు అదే అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో అరవింద్ కంటి ఆస్పత్రి పక్కన టీటీడీకి చెందిన 35 ఎకరాల భూమిని కేటాయించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇదివరకూ ఒబెరాయ్‌కు కేటాయించిన భూములకు ఎదురుగానే తాజాగా భూములు కేటాయిస్తున్నారు. అలాగే హయత్ సంస్థకు శిల్పారామంలో నిరుపయోగంగా ఉన్న మూడు ఎకరాల భూమిని కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. త్వరలో ఈ రెండు భూ కేటాయింపులపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడనున్నాయి.

దారి మారినా వెంటాడిన మృత్యువు



సిద్ధయ్య మృతదేహం

- గజదాడికి బలైన సిద్ధయ్యకు రూ.10 లక్షల పరిహారం

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏనుగు బారిన పడకుండా మరోమార్గంలో వెళ్లినా మృతువు ఆ రైతును వెంటాడింది. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ దాసరిగూడేనికి చెందిన రొడ్డా సిద్ధయ్య శుక్రవారం రాత్రి ఏనుగు దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆరు నెలలుగా భాకరాపేట, ఎగవూరు, చిట్టెచెర్ల పంచాయతీల్లో ఒంటరి ఏనుగు సంచరిస్తోందని రైతులు గుర్తించారు.అయితే మూడు రోజులుగా బోడేవాండ్లపల్లె-డక్కావాండ్లపల్లె మధ్య పొంతలకుంట మామిడి తోటల్లో రెండు ఏనుగులు తిష్ట వేశాయి. ఈ విషయం ఈ ప్రాంత రైతులకు తెలియలేదు. శుక్రవారం రాత్రి ఇందులో ఒక ఏనుగు చిట్టేచెర్ల క్రాస్, కుమ్మరపల్లె, మరం గొల్లపల్లె ప్రాంతాల్లో సంచరించి రాత్రి జంగమాల కొండ వద్ద ఎరప చెరువుకు చేరుకుంది. మరో ఏనుగు పొంతల కుంట నుంచి కొత్తపల్లె దేవరకొండ రోడ్డు మీదుగా ఎరప చెరువు వద్ద ఉన్న సహచర ఏనుగు వద్దకు వెళుతోంది.సిద్ధయ్య కూరగాయలు కోసుకొని ఒంటరి ఏనుగు బారిన పడకూడదని దేవరకొండ రోడ్డు మార్గాన బయలుదేరి కొత్తపల్లె సమీపాన రెండో ఏనుగుకు దొరికిపోయాడు. ఏనుగు దాడిలో మరణించారు. ఎప్పటిలా ఏనుగులను తరిమేందుకు అర్ధరాత్రి వచ్చిన భాకరాపేట ఫారెస్టు అధికారులు విగతజీవిగా పడివున్న సిద్ధయ్యను గుర్తించారు. కాగా, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది.

14సంవత్సరాల్లో 42మంది బలి

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత 14 ఏండ్లలో 42మంది గజదాడులకు బలైపోయారు.వీరిలో కొద్దిమంది మినహా ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటలను రక్షించుకునే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకున్న రైతులే వున్నారు. గజదాడులకు బలైన రైతుల్లో వెంకటేశులు,గంగులప్ప, సోనియా,వెంకటప్ప,ఉష,శివలింగం(కుప్పం మండలం), తిమ్మప్ప నాయుడు(గుడుపల్లె),కన్నానాయక్, రెడ్యా నాయక్, చిన్నబ్బ(రామకుప్పం),రామిరెడ్డి,ఆరేటయ్య, గంగులయ్య, వెంకట్రమణ (ఎర్రావారిపాలెం),వెంకట్రామయ్య (రామ సముద్రం), తుపాకుల చిన్నబ్బ(పుత్తూరు),మార్కొండేయ, బంగారప్ప(పెద్దపంజాణి),చిన్నబ్బ(బంగారుపాళ్యం),ఎల్లప్ప (సదుం), వెంకటేశు,సెల్వికార్తీక్,వసంత(గుడిపాల), మస్తాన్ (పులిచెర్ల), కణ్ణన్, రాకేష్ నాయుడు(చంద్రగిరి), చిన్న రాజారెడ్డి(పీలేరు), రొడ్డా సిద్ధయ్య(చిన్నగొట్టిగల్లు మండలం)తో పాటు యాదమరి మండలం దళవాయి పల్లెకు చెందిన ఇద్దరు,పలమనేరు మండలానికి చెందిన నలుగురు వున్నారు.ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్లు మరో నలుగురు కూడా గజదాడులకు బలైపోయారు.శివరాత్రి ఉత్సవాలకు తలకోన వస్తుండగా రైల్వేకోడూరుకు చెందిన ముగ్గురిని కూడా ఏనుగులు తొక్కి చంపేశాయి.

8న ముఖ్యమంత్రి రాక



- శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన
- ప్రాథమికంగా ఖరారైన పర్యటన

తిరుపతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు వచ్చే నెల 8న జిల్లాకు రానున్నారు. శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ప్రాథమికంగా సీఎం పర్యటన షెడ్యూలు ఖరారైందని కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్ శనివారం వెల్లడించారు. శ్రీసిటీలో భూములు కేటాయిస్తే రూ.5,001 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తయారు చేసే ప్లాంట్ నెలకొల్పుతామని ఎల్జీ సంస్థ గతేడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన సంగతి తెలిసిందే. ఈ ప్లాంట్ ద్వారా 1,495 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ ప్రతిపాదించింది. దీంతో మూడు దశలకూ కలిపి శ్రీసిటీలో ఆ సంస్థకు 450 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం గతేడాది నవంబరులో ఉత్తర్వులు జారీ చేసింది. దానితో పాటు అవసరమైన రాయితీలు, మినహాయింపులు సైతం ప్రకటించింది. తొలుత నిర్ణయించుకున్న షెడ్యూలు ప్రకారం ఎల్జీ సంస్థ ఈ ఏడాది జనవరిలోనే ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే వివిధ కారణాలతో ఆలస్యమైంది. ప్రస్తుతం ఏర్పాట్లన్నీ పూర్తి కావడంతో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని సంస్థ ప్రతినిధులు నిర్ణయించారు. ఆ మేరకు ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో వచ్చే నెల 8వ తేదీన సీఎం చంద్రబాబు పర్యటన ప్రాథమికంగా ఖరారైంది. దానికనుగుణంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.



కీర్తికుమార్

నీట్ సూపర్ స్పెషాలిటీలో..

గూడూరు డాక్టర్‌కు ఆలిండియా 132వ ర్యాంకు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కరణాలవీధికి చెందిన డాక్టర్ పర్వత కీర్తికుమార్ నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 132వ ర్యాంకు సాధించాడు. ఎండీ, ఎంఎస్ చేసిన వైద్యులు డీఎం, ఎంసీహెచ్ వంటి సూపర్ స్పెషాలిటీ కోర్సులను చేసేందుకు నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. వెంకటరమణయ్య, కోటేశ్వరి దంపతుల కుమారుడైన డాక్టర్ కీర్తికుమార్ స్థానిక ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష రాయగా శుక్రవారం విడులైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 132వ ర్యాంకు సాధించాడు. పలువురు వైద్యులు, కుటుంబ సభ్యులు ఆయన్ను అభినందించారు.

మత్స్యకారులకు అండగా..

- వేట నిషేధ భృతి జమ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలిచింది. చేపలవేట నిషేధ సమయంలో వారి కుటుంబాలు ఇబ్బంది పడకుండా శనివారం భృతి జమచేసింది. శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెంలో సీఎం చంద్రబాబు పాల్గొని లబ్ధిదారులకు భృతి అందజేయగా కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మత్స్యకారులు వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ కలిసి సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 3,947 మంది మత్స్యకారులకు రూ.7.89 కోట్ల చెక్కును మత్స్యకార నాయకులకు అందజేశారు. ఎమ్మెల్యే నెలవల మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో ఇచ్చే మత్స్యకార భృతిని రూ.20 వేలు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. మత్స్యకారులకు వలలు, డీజిల్ సబ్సిడీపై అందజేస్తున్నామని చెప్పారు. పులికాట్ ముఖద్వారం, రోడ్లు, పాఠశాలల ఏర్పాటు వంటి సమస్యలను మత్స్యకార నాయకులు కలెక్టర్‌కు విన్నవించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆక్వా రైతులు తమ సమస్యలపై విన్నవించారు.



మత్స్యకార భరోసా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్

ఏడుగురు సీఐల బదిలీ | నలుగురు వీఆర్‌కు

6



వీఐపీ కాటేజీలో నాగుపాము

తిరుమలలో వీఐపీలు బస చేసే స్పెషల్ టైప్ విశ్రాంతి భవనంలోని 14వ నెంబరు కాటేజీలోకి శనివారం ఐదున్నర అడుగుల నాగుపాము ప్రవేశించింది. భక్తులు భయంతో బయటకు వచ్చి భద్రతా సిబ్బందికి తెలియజేశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు అక్కడికి చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీవారి పుష్కరిణిలో వేసవి సందడి

తిరుమల శ్రీవారి పుష్కరిణి భక్తులతో కిటకిటలాడుతోంది. సాధారణంగా తిరుమలకు చేరుకునే భక్తులు ముందుగా పుష్కరిణిలో స్నానమాచరించి, వరాహస్వామిని దర్శించుకున్న తర్వాత శ్రీవారిని దర్శించుకుంటారు. వేసవి కూడా తోడవడంతో ప్రస్తుతం పుష్కరిణి సందడిగా మారింది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు పుష్కరిణిలో కనిపిస్తున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని కంపార్టుమెంట్లన్నీ సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్ల వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.37 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,536

తలనీలాలు సమర్పించినవారు: 30,612



కావు ఇవి చేటు..వెయ్యొద్దు వేటు

- కోనోకార్పస్ చెట్లపై భిన్నవాదనలు
- ఇవి పర్యావరణ హితమేనంటున్న జనవిజ్ఞాన వేదిక
- నేడు ప్రెస్‌క్లబ్‌లో నిపుణులతో సమావేశం



తిరుపతి-ఆంధ్రజ్యోతి

'కోనోకార్పస్ చెట్లపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. పశువులు తినవు. పిట్టలు వాలవు. పైగా ఆరోగ్యానికి కీడు కలిగిస్తాయి. జల వనరులను పీల్చేస్తాయి. పర్యావరణంతో పాటు మనుషులకూ హాని కలిగిస్తుందంటూ కొందరు చెబుతున్నారు. వీటితో ఏకీభవిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఇటీవల కాకినాడలో వ్యాఖ్యానించారు. ఈ విదేశీ వృక్షాలను తొలగించాలని ఆయన ఆదేశించారు. ఈ చెట్లపై చేస్తున్న ప్రచారాలన్నీ అపోహలేనని, శాస్త్రీయంగా ఏదీ రుజువు కాలేదని కొన్ని వర్గాలంటున్నాయి. ఇప్పటికే చాలాచోట్ల ఈ చెట్లను తొలగించే ప్రయత్నం చేశారు. వృక్షశాస్త్ర నిపుణులే విరుద్ధమైన వాదనలు లేవనెత్తుతున్నారు. శాస్త్రీయమైన పరిశోధన లేకుండానే కోనోకార్పస్ చెట్లు తొలగించకూడదని హైకోర్టులో ప్రజాప్రయోజనాల వాజ్యం కూడా దాఖలైంది. ఈ నేపథ్యంలో ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొందరు నిపుణులు సశాస్త్రీయమైన ఆధారాలతో ఈ మొక్క విశిష్టత గురించి వివరించనున్నారు.

● నగరంలో పలుచోట్ల ఆకర్షణగా...

తుడా, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో కూడా విరివిగా కోనోకార్పస్ చెట్లను నాటారు. విమానాశ్రయం, తుమ్మలగుంటమార్గం, రామానుజ సర్కిల్ నుంచి రిలయన్స్ మార్టు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఈ చెట్లు కనిపిస్తాయి. పుష్పిడి దశకు రాకుండానే వీటిని శంఖు ఆకృతిలో కట్ చేస్తుంటారు. అందం, ఆకర్షణ, చిక్కటి పచ్చదనంతో కనిపిస్తుంటాయి. గార్డెనింగ్‌కు అనువుగా ఉంటుందని కొందరు ఇళ్ల వద్దా పెంచుకుంటున్నారు.

● యూకలిప్టస్ కన్నా కోనోకార్పస్ సేఫ్

కోనోకార్పస్ చెట్ల వేర్లు విస్తరించి పైపులైన్లు, గోడలను దెబ్బతీస్తాయని, విషవాయువులను విడుదల చేస్తాయనేవి అపోహలే. ఏ చెట్ల వేర్లయినా విస్తరిస్తే ఇలాంటి ఫలితాలే ఉంటాయి. కోనోకార్పస్ చెట్లు వాయు కాలుష్యాన్ని తగ్గిస్తాయి.వీటి ద్వారా వచ్చే నూనె యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.మధుమేహాన్ని, వివిధ రకాల ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది.ఎక్కువగా కార్బన్‌డైఆక్సైడ్ పీల్చుకుని ఆక్సిజన్ మరింత ఎక్కువగా విడుదల చేస్తుంది.ఈ వృక్షాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నట్టు పరిశోధన పత్రాలు స్పష్టం చేస్తున్నాయి. కడప జిల్లాలో కొన్ని వందల ఎకరాలలో వీటిని పెంచుతున్నారు.

- మాధవశెట్టి, ప్రముఖ వృక్షశాస్త్ర నిపుణులు



ఏడుగురు సీఐల బదిలీ

● నలుగురు వీఆర్‌కు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ శనివారం రాత్రి అనంతపురం డీఐజీ షిమోషీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నలుగురిని వీఆర్‌కు బదిలీ చేశారు.రేణిగుంట రూరల్ సీఐ ఈ.మురళీకృష్ణ, శ్రీకాళహస్తి టూ టౌన్ సీఐ వెంకటేశ్వర్లను వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న నాగార్జున రెడ్డిని శ్రీకాళహస్తి టూ టౌన్‌కు, ఏర్పేడు సీఐ జయచంద్రను రేణిగుంటకు, అక్కడ పనిచేస్తున్న శరత్‌చంద్రను వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న శ్రీకాంత్ రెడ్డిని ఏర్పేడుకు, డీఐజీ వీఆర్‌లో ఉన్న మంజునాథ రెడ్డిని తిరుపతి ఎస్పీ వీఆర్‌కు బదిలీ చేశారు. వీరందరూ తక్షణం రిలీవ్ అయి వారికి కేటాయించిన స్థానాల్లో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సంక్షేమ వసతిగృహ టాపర్లకు అభినందనలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం అభినందించారు. పదిలో 586 వరకు మార్కులు సాధించిన విశ్వనాథ్, హనుమంత్, భావన, భగీరథ్, నీలకుమార్, భానుశ్రీ, గుణశేఖర్, దీపేష్, ఇంటర్‌లో 900లకు పైగా మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన హైమావతి, నీలావతి, లక్ష్మీప్రసన్న, యువశ్రీ, రాజు, సంజయ్‌ను కలెక్టర్ అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలతో పాటు అబ్దుల్‌కలాం ఆత్మకథ పుస్తకాలను అందజేశారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలకి విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో కలెక్టర్ వెంకటేశ్వర్

దివ్యారామంలో చెట్ల నరికివేతపై విచారణాధికారి నియామకం

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని దివ్యారామం ఎకో పార్క్‌లో నిబంధనలకు విరుద్ధంగా చెట్ల నరికివేతపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా పీసీసీఎఫ్(ప్రొడక్షన్) పీవీ చలపతిరావును నియమిస్తూ అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దివ్యారామంలో చెట్ల నరికివేత కార్యకలాపాల్లో పాల్గొన్న అధికారుల పాత్రను నిర్ధారించడం, ఈ ఉదంతంపై విచారణ నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 30లోగా ప్రభుత్వానికి వివరణాత్మక నివేదిక సమర్పించాలని విచారణాధికారిని ఆదేశించారు. కాగా దివ్యారామంలో చెట్ల నరికివేతపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సీరియస్ అవడంతో అటవీశాఖ విచారణకు ఆదేశించింది.

'మనోళ్ల దగ్గర ఉండుంటాడులే' అనుకుని..

● దర్శనానికి వెళ్లిపోయిన తల్లిదండ్రులు

● గుర్తించి అప్పగించిన తిరుమల పోలీసులు

తిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాత్రి తప్పిపోయిన ఆరేళ్ల పిల్లాడిని తిరుమల పోలీసులు ఉదయానికల్లా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కర్ణాటకలోని కాడెనందిహళ్లికి చెందిన శేఖరప్ప, రేణుక దంపతులు ముగ్గురు పిల్లలు, మరికొంతమంది కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చారు. రాత్రి 8 గంటల సమయంలో తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం 2 వద్ద టీ తాగారు. ఆ సమయంలో శేఖరప్ప ఆరేళ్ల చిన్న కుమారుడు మాన్విత్ కనిపించలేదు. తమ బంధువులతో కలిసి దర్శనానికి వెళ్లి ఉంటాడని భావించిన తల్లిదండ్రులు దర్శనానికి వెళ్లారు. వెనక్కి వచ్చి చూస్తే పిల్లాడు కనిపించలేదు. గాలించినా దొరక్కపోవడంతో టీటీడీ బ్రాడ్ కాస్టింగ్ ద్వారా శనివారం ఉదయం ప్రచారం చేయించారు. యాత్రికుల సముదాయంలోని 4వ నెంబరు హాల్‌లో ఆరేళ్ల మాన్విత్‌ను గుర్తించిన పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.



మాన్విత్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అలిగివచ్చిన మహిళ అప్పగింత

ఇంటి నుంచి అలిగి తిరుమలకు వచ్చిన ఓ మహిళను తిరుమల పోలీసులు తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విశాఖపట్నంకు చెందిన రమ్యరాజు(40) ఇంట్లో గొడవలతో మనస్థాపం చెంది 24వ తేదీన ఇంటి నుంచి తిరుమలకు చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆందోళన పడుతుండగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వారికి ఫోన్ చేసి, తిరుమలలో ఉన్నట్టు చెప్పింది. కుటుంబ సభ్యులు వెంటనే తిరుమల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫోన్ నెంబరు ఆధారంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద ఆ మహిళను గురించి అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం తిరుమలకు చేరుకున్న కుటుంబ సభ్యులకు రమ్యరాజును పోలీసులు అప్పగించారు.

సిద్ధయ్య కుటుంబానికి పరిహారం



సిద్ధయ్య అంత్యక్రియలు



సిద్ధయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న టీడీపీ నేతలు

భాకరాపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో అశువులు బాసిన సిద్ధయ్య(72) అంత్యక్రియలను శనివారం స్వగ్రామం దాసరి గూడెంలో నిర్వహించారు. సిద్ధయ్య కుటుంబానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షలు పరిహారం ప్రకటించినట్లు చంద్రగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దేవర మనోహర్ తెలిపారు. శనివారం సిద్ధయ్య అంత్యక్రియల్లో పాల్గొని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఫోన్ ద్వారా సిద్ధయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిద్ధయ్య దహన సంస్కారాలకు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని పార్టీ నాయకులతో పంపించారు. సర్పంచ్ నాగచెంగమ నాయుడు, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, చాంద్‌బాషా, సహదేవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవులు, శని త్రయోదశి కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన బస్సు





గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

● పలువురు కార్మికులకు గాయాలు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పరిశ్రమకు కార్మికులను తరలిస్తున్న ఓ బస్సు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పలువురు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. నాగలాపురం మండలం వేంబాక్కం పంచాయతీ హరిజనవాడ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు చెందిన బస్సు నాగలాపురం నుంచి కార్మికులను తీసుకెళ్తుండగా వేంబాక్కం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. బస్సులోని 35మంది ప్రయాణికుల్లో 22 మందికి స్వల్ప గాయాలు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సునీల్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తొమ్మిదిమందిని మెరుగైన వైద్యం కోసం నగరి ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం బాధితులను ఫోన్‌లో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వివిధ అంశాలపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. నీటి సమస్య ఉన్న ప్రదేశాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. అలాగే తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు భూ కేటాయింపుపై సమగ్ర విచారణ చేయండి

● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశం

తిరుపతి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి చెందిన భూములు శేషాచలం వైల్డ్‌లైఫ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తాయని మీడియాలో వచ్చిన కథనాలపై తక్షణం నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. షిరిడీ సాయి కంపెనీకి కేటాయించిన భూముల్లో అటవీ భూముల క్రమబద్ధీకరణ చట్టం 1980 నిబంధనలు పూర్తిగా గాలికి వదిలేశారని వచ్చిన మీడియా కథనాలను పవన్ పరిశీలించి అధికారులతో సమీక్షించారు. భూ కేటాయింపులు, సంబంధిత వివరాలు నివేదిక రూపంలో అందజేయాలని, కేటాయింపుల ప్రక్రియపైనా వివరాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. తిరుపతిలోని శేషాచలం అడవులకు ఆనుకుని ఉన్న ఉపాధ్యాయనగర్ గ్రాండ్ వరల్డ్ రోడ్డులో అటవీ సరిహద్దు కంచె ధ్వంసం కావడంతో వన్యప్రాణులు దప్పిక కోసం, తిండి కోసం బయటకు వస్తూ ప్రాణాపాయ పరిస్థితిలోకి వెళ్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వివరాలు చూసి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి అటవీ, బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ పరిధిలో ఉన్న ఫెన్సింగ్‌కు తగిన మరమ్మతులు చేయాలని అటవీ అధికారులను ఆదేశించారు.

శ్రీసిటీ సెజ్ దేశానికి ఉత్తమ నమూనా

శ్రీసిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సెజ్ పాలసీ లక్ష్యాలకనుగుణంగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ పారిశ్రామికవాడ దేశానికి ఉత్తమ నమూనాగా కేంద్ర వాణిజ్య శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి జి.కె.పిళ్లై అభివర్ణించారు. దేశంలో సెజ్‌ల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన పలువురు కేంద్ర ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారులు శ్రీసిటీని సందర్శించారు. దేశంలో సెజ్‌లు స్థాపించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన ప్రత్యేకతను సంతరించుకుంది. జి.కె.పిళ్లై ఆధ్వర్యంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికాలరు. శ్రీసిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సాధించిన విజయాలు, ప్రగతిని వివరించారు. శ్రీసిటీ పరిసరాల సందర్శన అనంతరం వివిధ పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ మాట్లాడుతూ సెజ్ పాలసీ మార్గదర్శకులు శ్రీసిటీ పర్యటనకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. శ్రీసిటీ ఏర్పాటు సమయంలో అందించిన ప్రోత్సాహం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. జి.కె.పిళ్లై మాట్లాడుతూ... బంజరు భూమి నుంచి అద్భుత పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ రూపాంతరం చెందడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. శ్రీసిటీలో పెట్టుబడులు - స్నేహపూర్వక వాతావరణ వ్యవస్థను సీబీఐసీ మాజీ సభ్యుడు యోగేంద్ర గార్గ్ కొనియాడారు. అనంతరం అధికారుల బృందం ట్రిపుల్ ఐటీకి వెళ్లి అక్కడ విద్యార్థులు, అధ్యాపకులతో చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. పర్యటన బృందంలో గోవా మాజీ చీఫ్ సెక్రటరీ బి.విజయన్, ఐటీఎస్ మాజీ అధికారి ఎల్.బి.సింఘాల్, ఇండస్ట్రియల్ పార్క్, వేర్ హౌసింగ్ మండలి మాజీ కో-చైర్మన్ హితేంద్ర మెహతా తదితరులు పాల్గొన్నారు.



మాజీ అధికారుల బృందంతో శ్రీసిటీ ఎండీ

తిరుపతిలో ముమ్మరంగా తనిఖీలు

జనసంద్ర ప్రాంతాలను జల్లెడ పట్టిన భద్రతా దళాలు



తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. తిరుపతి నగరంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, టీటీడీ వసతి గృహాలు, అలిపిరి చెక్ పాయింట్ల వద్ద శనివారం తనిఖీలు చేశారు. అనుమానమున్న ప్రతి ఒక్కరినీ విచారణ జరిపి, వివరాలు సేకరించారు. మరో వైపు బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలను తనిఖీ చేశాయి. పార్సిల్ కార్యాలయం వద్ద డాగ్ స్క్వాడ్లు తనిఖీ చేశాయి. సెంట్రల్ బస్టాండులోని చెన్నై ప్లాట్‌ఫారం వద్ద అనుమానంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తిరుపతికి వచ్చే ప్రయాణికులను భారతి బస్టాండు వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేశారు. లగేజీ కేంద్రాలు, కొరియర్ కార్యాలయాలు, లాజిస్టిక్స్ ఆఫీసుల్లో అణువణువూ పరిశీలించారు. దీంతోపాటు నగరంలో డ్రోన్ నిఘా పెంచారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత

కోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ఇసుకలో కూరుకుపోయి మృతి చెందిన ఘటన కోట మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.... తిన్నెలపూడి పంచాయతీలోని లక్ష్మమ్మకండ్రిగ అరుంధతివాడకు చెందిన పారిచర్ల సుబ్రహ్మణ్యం(40) శనివారం ఇద్దరు స్నేహితులతో కలిసి తాటితోపు వద్ద రంపపు కోత పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పనులు ముగించుకుని సమీపంలో ఉన్న స్వర్ణముఖి నదిలోని వెళ్లారు. సుబ్రహ్మణ్యం చేపలు పట్టేందుకు నది మధ్యలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు ఇసుకలో కూరుకుపోయాడు. వెంటనే అతని స్నేహితులు ఇద్దరూ లక్ష్మక్క కండ్రిగలోకి వెళ్లి జరిగిన విషయం చెప్పడంతో గ్రామస్తులంతా వచ్చి ఇసుకలో కూరుకుపోయిన సుబ్రహ్మణ్యంను బయటకు లాగగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతిచెందిన సుబ్రహ్మణ్యం

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి(ఆటోనగర్)ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులు ఆదివారం తమ రెవెన్యూ కార్యాలయాల్లో చెల్లించవచ్చని ఆ డివిజన్ ఈఈ చంద్రశేఖర్ రావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సిబ్బంది పని చేస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వరి పొలాల మీదుగా మృతదేహాన్ని మోసుకెళ్తున్న కానూరు గ్రామస్తులు(ఫైల్‌ఫొటో)

ఆఖరి మజిలీకి అవస్థలు

శ్మశానవాటికలకు దారి లేక ఇబ్బందులు

పెళ్లకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ఆఖరి మజిలీ అయిన అంత్యక్రియలను నిర్వహించడానికి కూడా పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కగారిపేట, కానూరు, రావులపాడు తదితర గ్రామాల్లో మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు దారిలేక పడుతున్న ఆయా గ్రామాల ప్రజల బాధలు వర్ణనాతీతం. ఊరికి దూరంగా ఉన్న శ్మశానవాటికకు వెళ్లాలంటే పంట పొలాల గట్లు మీదుగా పడిలేస్తూ మృతదేహాలను తీసుకెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా వర్షాకాలంలో మృతదేహాలను తరలించి అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. శ్మశానవాటికలు కూడా కంపచెట్లతో నిండిపోయి ఉండడంతో దహన కార్యక్రమాలకు అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి శ్మశాన వాటికలకు దారి సౌకర్యం కల్పిండంతో పాటు కంపచెట్లు, వ్యర్థాలను తొలగించి తగిన వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

4నుంచి పోలేరమ్మ జాతర



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) నాయుడుపేట పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతరను వచ్చే నెల 4వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి ఆవిష్కరించారు. 4,5 తేదీల్లో ఘటోత్సవం, 6వ తేదీ రాత్రి అమ్మరాత్రి నిలుపు, 7న అమ్మవారి జాతర, అదేరోజు రాత్రి అమ్మవారి సాగనంపు ఉత్సవం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈవో రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు నానాపాల సుబ్బారావు, మణి, అరవభూమి శ్రీనివాసులు రెడ్డి, గోపి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, నారాయణ, రవి, వెంకటేశ్వర్లు, ధనుంజయ, మస్తాన్, అశోక్, రామారావు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాజస్వామి ఉత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణం

తడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడుకుప్పం గ్రామంలో ఉన్న పంచపాండవ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హిడింబి వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి మహాభారతం ప్రథమ ఘట్టం అయిన భకాసుర వధ జరిగింది. భీమసేనుడు భకాసురుడిని వధించే సన్నివేశం ఆకట్టుకుంది. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తమిళనాడుకు చెందిన సెలం శరవణ బృందం పాటకచ్చేరితో అలరించగా, దివాకర్ బృందం ఆటపాటలతో ఉర్రూతలూగించింది.

మత్స్యకారులకు అండగా నిలిచేది టీడీపీనే



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, మత్స్యకారులు

చిల్లకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి తోడ్పాటునందించేది టీడీపీనేనని తెలుగు యువత అధికార ప్రతినిధి సతీష్ యాదవ్ అన్నారు. చేపల వేట నిషేధ కాలానికి మత్స్యకార భరోసా కింద రూ.20వేలు ప్రభుత్వం అందజేసిన సందర్భంగా శనివారం మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీకి మత్సకారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మత్స్యకారులకు మత్స్యకార భరోసా నగదు రూ.20 వేలు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మత్సకార నాయకులు రామయ్య, వెంకయ్య, సుబ్రహ్మణ్యం, నాగూర్‌బాబు, పోలయ్య, మస్తాన్, పవన్, మౌల పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై ఉపాధి హామీ కూలీలకు శనివారం ఎంపీడీవో మనోహర్ గౌడ్ అవగాహన కల్పించారు. మండలంలోని పల్లంపర్తి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల గురించి వివరించారు. ఎండ తీవ్రంగా ఉండడంతో ఉదయాన్నే పని చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో షెల్టర్ ఏర్పాటు, తాగునీరు కూలీలకు అందించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నెముత్తేరి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు కోళ్లమిట్ట, డేగపాలెం, షార్ బైజంక్షన్, గవర్నమెంట్ ఆస్పత్రి రోడ్డు, రాఘవయ్యపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈడీఈ శేఖర్ తెలిపారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు



గాయపడిన నవ్య

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట విన్నమాల జాతీయ రహదారి సమీపంలో లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు పట్టణానికి చెందిన నవ్య స్కూటీలో వెళుతుండగా నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలో లారీలో ఇనుప ఊచలు మహిళ తలకు తగలడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సమాచారం అందుకున్న 108సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కోట మండలం గున్నంపడియ వద్ద పూర్తిగా ఎండిపోయిన సొనకాలువ - యమదిన్నెపాళెం వద్ద అడుగంటిన దృశ్యం

అడుగంటిపోతున్న సొనకాలువలు

తీరం ప్రాంతాలకు పొంచిఉన్న నీటి ఎద్దడి ముప్పు

కోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా సముద్రతీర ప్రాంతవాసుల కల్పతరువులైన సొనకాలువలు తడి ఆరుతున్నాయి. తీరం ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించే జలధారలు కన్నీటి ధారలవుతున్నాయి. సొన కాలువల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతుండడంతో తీరం ప్రాంతాలకు ప్రమాదం పొంచి ఉందనే చెప్పాలి. కోట, చిల్లకూరు మండలాల్లో దాదాపుగా 82 సొనకాలువలు ఉన్నాయి. ఇసుక, సిలికాతో కప్పబడి ఉండే సొనకాలువలు భూగర్భ జలాలతో ఎప్పుడూ కళకళలాడుతుండేవి. ఒకటి నుంచి ఐదు అడుగుల లోపే నీరు లభిస్తుండడంతో తీర ప్రాంతాలకు కల్పతరువులుగా ఉండేవి. వర్షాలు పడకపోయినా సొన కాలువల్లో మాత్రం జలధార పుష్కలంగా ఉండే ఈ సొనకాలువలను ఆధారం చేసుకుని వేరుశనగ, పుచ్చ, వరి పంటలను సాగుచేసేవారు. అయితే ఈ ఏడాది కోట మండలంలోని యమదిన్నెపాళెం, గున్నంపడియ, కొత్తపట్నం, శ్రీనివాసనత్రం, కర్లపూడి గ్రామాల్లో ఉన్న సొనకాలువలు పూర్తిగా అడుగంటిపోయాయి. భూగర్భ జలాలు దాదాపుగా పడిపోయాయి. దీంతో సముద్రతీరం వెంబడి ఉన్న సుమారు 15 గ్రామాలకు జల గండం తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన రెవెన్యూ అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులందరి సమక్షంలో రీసర్వే సమగ్రంగా నిర్వహించాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. శనివారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో రెండో విడత రీసర్వేపై డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెండో విడతలో 15 గ్రామాలను రీ సర్వేకు ఎంపిక చేశామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో రీ సర్వేను సమగ్రంగా నిర్వహించాలన్నారు. రీ సర్వే నిర్వహించే గ్రామాల్లో ముందస్తుగా రైతులకు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వాలన్నారు. తొలి విడతలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమర్థవంతంగా గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో 200నుంచి 250 ఎకరాల వరకు ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసుకొని సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట తహసీల్దార్లు నరసింహారావు, శరత్, శైలాకుమారి, రాజేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మా గ్రామం వద్ద చెత్త పోయొద్దు

మున్సిపాలిటీ ట్రాక్టర్లను అడ్డుకున్న పెరిమిటిపాడువాసులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో సేకరించిన చెత్తను మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్‌లో తీసుకెళ్లి పెరిమిటిపాడు వద్దనున్న ప్రభుత్వ భూముల్లో పోసేందుకు ప్రయత్నించారు. ఇందుకు గ్రామస్తులు కొందరు అభ్యంతరం చెబుతూ తమ గ్రామ పరిధిలో చెత్త పోయొద్దంటూ ట్రాక్టర్‌ను అడ్డుకొన్నారు. సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న డంపింగ్ యార్డులో పది రోజుల క్రితం చెలరేగిన మంటలు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. దీంతో డంపింగ్ యార్డులో చెత్త పోయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు మండల పరిధిలోని పెరిమిటిపాడు సమీపంలోని ముప్పాలమ్మ ఆలయ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో చెత్త డంపింగ్ చేసేందుకు రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. శనివారం ట్రాక్టర్లు చెత్తను తీసుకెళ్లడంతో ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్లను వెనుదిరిగాయి.

విద్యార్థినికి సత్కారం



ఇంద్రజను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

దక్కిలి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దక్కిలి మండలం చాపలపల్లి గ్రామానికి చెందిన కలపాటి ఇంద్రజ పదో తరగతి పరీక్షల్లో 594 మార్కులు సాధించి జిల్లాటాపర్‌గా నిలిచింది. ఈ విద్యార్థిని శనివారం మహాజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య, యూటీఎఫ్ నాయకుడు పులకంటా రామయ్య చాపలపల్లి గ్రామానికి వెళ్లి ఇంద్రజ శాలువాతో సత్కరించారు. ఇంగ్లీషు డిక్షనరీ అందజేశారు. స్వీట్లు పంచిపెట్టారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో శనివారం పొనకా మల్లికార్జునరెడ్డి సహకారంతో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, శివకుమార్‌రెడ్డి, ప్రభాకర్, కరీముల్లా, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి



సమావేశంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశుమందిరం పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని పాఠశాల కమిటీ సభ్యులు అన్నారు. శనివారం స్థానిక పూలతోట గిరిజన కాలనీలోని సరస్వతి శిశుమందిరం పాఠశాలలో కమిటీ సభ్యులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు దేశభక్తి, దేశసంస్కృతి, సంప్రదాయాలు, కళలు, యోగా తదితర వాటితో పాటు మెరుగైన బోధన అందించాలన్నారు. తద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో యుగంధర్, మురళీ రెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, విశ్వేశ్వరరావు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న విజయ్‌కుమార్

వాకాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెంకాయల తోపు గిరిజన కాలనీకి చెందిన బండి మునీంద్ర(27) వడదెబ్బతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామా విజయ్‌కుమార్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం

గూడూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరులో ఎన్‌ఆర్‌ఐ శషాంక్‌రెడ్డి సహకారంతో క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఆర్‌సీసీ సభ్యులు మాట్లాడుతూ 15 ఏళ్ల లోపు ఆటగాళ్లను గుర్తించి వారికి అనుభవం కలిగిన కోచ్‌లతో 45రోజుల పాటు ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రామ్‌గోపాల్, మస్తాన్, అవినాష్, రాజీవ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో ప్రాంగణ ఎంపికలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం శ్రీసిటీలో కిమ్‌బెర్లీ క్లార్క్ మల్టీనేషనల్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ముచ్చుకాల సురేష్ తెలిపారు. కంపెనీ సీనియర్ మేనేజర్లు శ్రీకాంత్, అనుషా ఇంటర్వ్యూలు నిర్వహించారు. డిప్లమో, ఇంజనీరింగ్‌లో వివిధ విభాగాల నుంచి 25 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు, ఐదుగురు విద్యార్థులను ఇంజనీరింగ్ అసోసియేట్స్‌గా ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

9న ఎన్‌బీకేఆర్‌లో సృజన సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మే 9వ తేదీన జరిగే సృజన 2కే25 జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు ఆవిష్కరించారు. సైన్స్ అండ్ హ్యూమనిటీస్ విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు దేశంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ఆవిష్కరణలు చేస్తారు. విద్యార్థుల పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్‌లలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హౌస్ బ్రేకింగ్ కేసులపై దృష్టిపెట్టండి

జిల్లా నేర సమీక్షలో ఎస్పీ ఆదేశం



జిల్లా స్థాయి నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రేవ్ (మర్డర్, డోపిడీలు, రోడ్డుప్రమాదంలో ఎక్కువమంది చనిపోవడం, అత్యాచారాలు, ఫోక్సో కేసులు) కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, హౌస్ బ్రేకింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. శనివారం తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో జిల్లాస్థాయి నేర సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా గ్రేవ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయడం, హౌస్ బ్రేకింగ్ కేసులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సమీక్షించారు. సబ్ డివిజన్ల వారీగా వున్న కేసుల వివరాలు తెలుసుకుని సరిగా పని చేయని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రేవ్ కేసుల పరిష్కారానికి అవసరమైతే ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసుకుని వేగవంతంగా పరిష్కరించాలన్నారు. మిస్సింగ్ కేసులకు సంబంధించి ప్రతి ఫైలునూ పరిశీలించారు. 2021 నుంచి జరిగిన హౌస్ బ్రేకింగ్ కేసులపై ఆరా తీశారు. గూడూరు, నాయుడుపేట, పుత్తూరు సబ్ డివిజన్ల పరిధిలో కేసుల పురోగతిపై వారిని అభినందించారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడేలా ట్రాఫిక్ పోలీసులు పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు రామకృష్ణ, రవిమనోహరాచారి, నాగభూషణరావు, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



పహల్గాం మృతులకు నల్లబ్యాడ్జిలను ధరించి సంతాపం తెలుపుతున్న సునీత సేవాసంస్థ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై మారణకాండకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సునీత సేవాసంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా అయిన భారతదేశం ఉగ్రవాదులు హిందువులనే లక్ష్యంగా చేసుకుని హతమార్చడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

మహిళపై దాడి

ఓజిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం సగుటూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన దేవళ్ల అంకమ్మపై అదే గ్రామానికి చెందిన మల్లి పద్మమ్మ, ఆమె భర్తతో పాటు మరో ముగ్గురు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వప్న తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.... అంకమ్మ గ్రామంలోని దుకాణం వద్దకు వెళుతుండగా తమను గేలిచేసిందంటూ అదే గ్రామానికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా బాధితురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణకు గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

బాలాయపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) కశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడుల నేపథ్యంలో మండలంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. శనివారం మన్నూరు క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు.

సరదాతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈత సరదాతో చిన్నారులు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గాంధీనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లోని నీటి గుంతల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు సెలవు కావడంతో చిన్నారులు సరదాగా నీటి గుంటలు, బావులు, కాలువల్లోకి ఈతకు వెళుతుంటారన్నారు. నీటి లోతు తెలియక ప్రమాదలకు గురయ్యే అవకాశం ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు.